

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 08-10-2025 | సంపుటి - 25 | సంచిక -144 | రూ : 4 | పేజీలు: 8



## ఫార్మా హబ్‌గా హైదరాబాద్

- తెలంగాణకు తరలివచ్చిన మరో భారీ పెట్టుబడి
- రూ.9,000 కోట్లతో ముందుకొచ్చిన ఫార్మా దిగ్గజం ఎలీ లిల్లీ
- హైదరాబాద్‌లో దేశంలోనే తొలి మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటు
- పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానంగా మారిందన్న సీఎం రేవంత్
- స్థానికంగా పెరగనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

2లో

### ఆర్‌ఆర్ బీ

## ఉద్యోగాల జాతర..

- 8 వేలకు పైగా ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ
- గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్లకు మంచి అవకాశం
- క్లర్క్, మేనేజర్, స్టేషన్ మాస్టర్, అకౌంట్స్ ఆఫీసర్ తదితర పోస్టుల భర్తీ

2లో





2లో

## బీసీ రిజర్వేషన్ల అంశంపై రేవంత్ రెడ్డి ఫుల్ ఫోకస్..

- రంగంలో ఫేమస్ లాయర్
- తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై ప్రతిష్ఠాత్మక దృష్టి
- సుప్రీంకోర్టు విచారణలో రాష్ట్రానికి బలమైన వాదనలు
- సీఎం రేవంత్-అభిషేక్ సింఘ్వీ కీలక సమన్వయం
- హైకోర్టు ముందు ప్రత్యేక వ్యూహ సమావేశం



### భౌతికశాస్త్రంలో

## ముగ్గురికి నోబెల్

- 2025 సంవత్సరానికి భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రకటన
- ముగ్గురు అమెరికా శాస్త్రవేత్తలను వరించిన ప్రతిష్ఠాత్మక పురస్కారం
- జాన్ క్లార్క్, మైఖేల్ డివోరెట్, జాన్ మార్టినిస్‌లకు సంయుక్తంగా అవార్డు

2లో

### డ్రైవింగ్‌లో ఫోన్

## వాడుతున్నారా?

- డ్రైవింగ్‌లో ఫోన్ వాడే వారిపై కఠిన చర్యలు తప్పవన్న సీపీ సజ్జనార్
- వీడియోలు చూడటం, ఇయర్‌ఫోన్స్ వాడటం శిక్షార్హమన్న సీపీ
- ముఖ్యంగా ఆటో, క్యాబ్, బైక్ టాక్సీ డ్రైవర్లే లక్ష్యం
- డ్రైవర్ల పరధ్యానం ప్రాణాలకే ముప్పని స్పష్టీకరణ
- రోడ్డు భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచన



2లో



2లో

## హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ నెమ్మదించడానికి కారణాలివే

- హైదరాబాద్ రియల్ ఎస్టేట్ స్తబ్ధతపై రంగనాథ్ స్పష్టత
- మార్కెట్ నెమ్మదించడానికి హైడ్రా కారణం కాదన్న హైడ్రా కమిషనర్
- పెరిగిపోయిన అన్-సోల్డ్ ఇన్వెంటరీ, తగ్గిన ఎన్నారై పెట్టుబడులే అసలు కారణం
- వడ్డీ రేట్ల పెరుగుదల, ఏఐతో ఉద్యోగ భయాలు కూడా ప్రభావం చూపుతున్నాయని వెల్లడి

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక..
### సాయంత్రం తెలంగాణ టీడీపీ నేతలతో

## చంద్రబాబు కీలక భేటీ



2లో

## అలా చేస్తే ఊరుకోం..

స్తంభింపచేస్తాం: రేవంత్ సర్కార్‌కు కవిత హెచ్చరిక

4లో

## హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. లేట్ నైట్ వారికోసమే..!

4లో



2లో

### ఆన్‌లైన్‌లో నా డీప్ ఫేక్ వీడియోలు కూడా చూశాను

: నిర్మలా సీతారామన్

- ఆన్‌లైన్‌లో తన డీప్‌ఫేక్ వీడియోలు ఉన్నాయని చెప్పిన నిర్మలా సీతారామన్
- ఏఐతో గొంతులు, గుర్తింపు మార్చి మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరిక
- పెట్టుబడిదారుల కోసం సెబీ, ఎన్‌పీసీఐ ప్రత్యేక యూపీఐ హ్యాండిల్స్

# ఫార్మా హబ్‌గా హైదరాబాద్.. రూ.9 వేల కోట్ల పెట్టుబడిని ప్రకటించిన దిగ్గజ సంస్థ

హైదరాబాద్, అక్టోబర్ 07 : తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి వచ్చి చేరింది. ప్రపంచ ప్రఖ్యాత ఫార్మా సంస్థ 'ఎలీ లిల్లీ అండ్ కంపెనీ' సుమారు రూ.9,000 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ఇండియాలోనే తమ మొట్టమొదటి మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌ను ఇక్కడ ఏర్పాటు చేయనుంది. సోమవారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎలీ లిల్లీ ప్రతినిధి బృందం సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందని, ఎలీ లిల్లీ వంటి దిగ్గజ సంస్థ ముందుకు రావడం సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రంపై నమ్మకం ఉంచినందుకు కంపెనీకి ధన్యవాదాలు తెలిపిన ఆయన, కొత్త పరిశ్రమలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ఈ మాన్యుఫ్యాక్చరింగ్ క్వాలిటీ హబ్ తమకు అత్యంత కీలకమని ఎలీ లిల్లీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్ తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఔషధాల తయారీ, సరఫరా సామర్థ్యాన్ని పెంచేందుకు భారీగా పెట్టుబడులు పెడుతున్నాం. హైదరాబాద్ హబ్ నుంచి దేశంలోని మా కాంట్రాక్ట్ తయారీ నెట్‌వర్క్‌ను పర్యవేక్షిస్తాం" అని ఆయన వివరించారు. ఈ కొత్త కేంద్రం ద్వారా తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఫార్మా రంగ నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని, త్వరలోనే ఇంజినీర్లు, సైంటిస్టులు, ఇతర నిపుణుల నియామకాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఎలీ లిల్లీ విస్తరణ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి నిదర్శనమని అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణ ముందుండటం వల్లే ఇలాంటి ప్రపంచస్థాయి సంస్థలు ఆకర్షితులవుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ ఫార్మా రంగానికి మొదటి నుంచి కేంద్రంగా ఉందని, దేశంలోని బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎలీ లిల్లీ సంస్థకు ఇప్పటికే గురుగ్రామ్, బెంగళూరు నగరాల్లో కార్యకలాపాలు ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టులోనే హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను కూడా ప్రారంభించింది. ఆ సమయంలో మంత్రి శ్రీధర్ బాబు జరిపిన చర్చలు, తాజాగా సీఎం రేవంత్ రెడ్డితో జరిగిన సమావేశం ఫలించడంతో ఈ భారీ పెట్టుబడికి మార్గం సుగమమైంది.

## డ్రైవింగ్‌లో ఫోన్ వాడుతున్నారా?...
# సీపీ సజ్జనార్ సీరియస్ వార్నింగ్!

హైదరాబాద్, అక్టోబర్ 07 : వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్‌లో వీడియోలు చూడటం, చెవిలో ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని కబుర్లలో మునిగిపోవడం వంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు ఇకపై చెక్ పెట్టాలని హైదరాబాద్ పోలీసులు నిర్ణయించారు. ఇలాంటి ప్రమాదకరమైన చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీవ్రంగా హెచ్చరించారు. డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్ వాడటం కేవలం ప్రమాదకరమే కాదని, చట్టప్రకారం శిక్షార్హమైన నేరమని ఆయన స్పష్టం చేశారు. ప్రధానంగా ఆటో రిక్షా, క్యాబ్, బైక్ ట్యాక్సీ డ్రైవర్లలో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో ఫోన్ వాడటం వల్ల వారి ఏకాగ్రత పూర్తిగా దెబ్బతింటుందని, రోడ్డుపై దృష్టి నిలపలేరని తెలిపారు. ఇది డ్రైవర్లకే కాకుండా వాహనంలోని ప్రయాణికులకు, రోడ్డుపై వెళ్లే పాదచారులకు కూడా ప్రాణాంతకంగా పరిణమించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్‌ను ఉపేక్షించేది లేదని, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని సజ్జనార్ స్పష్టం చేశారు. డ్రైవర్, ప్రయాణికులతో పాటు రోడ్డుపై వెళ్లే ప్రతి ఒక్కరి భద్రతే తమకు అత్యంత ముఖ్యమని తెలిపారు. క్షణం పాటు పరధ్యానం ప్రాణాలకే ముప్పు తెస్తుందని గుర్తుంచుకోవాలని ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా సూచించారు. చిన్న చిన్న అవసరాల కోసం విలువైన ప్రాణాలను పణంగా పెట్టవద్దని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ టీడీపీ నేతలతో చంద్రబాబు కీలక భేటీ

హైదరాబాద్, అక్టోబర్ 07 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఈ రోజు సాయంత్రం తెలంగాణ టీడీపీ నేతలతో సమావేశం కానున్నారు. వచ్చే నెలలో హైదరాబాద్ నగర పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలపై చర్చించడానికి ఆయన నేతలతో కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఈ రోజు సాయంత్రం 7 గంటలకు ఉండవల్లిలోని తన నివాసంలో చంద్రబాబు నేతలతో సమావేశం కానున్నారు. ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి మద్దతునిచ్చి, వారి గెలుపు కోసం కృషి చేయాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ నేతలకు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. తన సొంతూరు నారావారిపల్లెలో ఉన్న చంద్రబాబు సాయంత్రం ఉండవల్లికి రానున్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం నిన్న విడుదల చేసింది. నవంబర్ 11వ తేదీన పోలింగ్, 14న ఫలితాలు వెలువడనున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అనివార్యమైంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఈ నెల 13న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 21వ తేదీ వరకు నామినేషన్ దాఖలుకు గడువు, 22న నామినేషన్ల పరిశీలన, 24 వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతుంది.

# హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ నెమ్మదించడానికి అసలు కారణాలివే : హైడ్రా కమిషనర్

హైదరాబాద్, అక్టోబర్ 07 : గత కొంతకాలంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న స్తబ్ధతకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) ఆధ్వర్యంలోని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) తీసుకుంటున్న చర్యలే కారణమంటూ వస్తున్న ఆరోపణలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. ఈ ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. మార్కెట్ నెమ్మదించడానికి అసలు కారణాలు వేరే ఉన్నాయని, కేవలం తమపై నిందలు మోపడం సరికాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో డిమాండ్‌కు మించి సప్లై ఉందని రంగనాథ్ వివరించారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్రాజెక్టులు, ఫ్లాట్లు భారీ సంఖ్యలో పేరుకుపోయాయని (అన్‌సోల్డ్ ఇన్వెంటరీ), ఇది మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. దీనికి తోడు, అమెరికా వంటి విదేశాల నుంచి వచ్చే ఎన్నారై పెట్టుబడులు, రెమిటెన్స్‌లు గణనీయంగా తగ్గిపోయాయని ఆయన పేర్కొన్నారు. పెరుగుతున్న వడ్డీ రేట్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కారణంగా ఉద్యోగాలు పోతాయనే భయాలు కూడా కొనుగోలు శక్తిని దెబ్బతీస్తున్నాయని విశ్లేషించారు. "ప్రతిదానికీ హైడ్రాను బాధ్యుల్ని చేయడం ఒక బ్లేమ్ గేమ్‌లా మారింది. మా కార్యకలాపాలు కేవలం హైదరాబాద్‌కే పరిమితం. మరి ఖమ్మం, వరంగల్ వంటి నగరాల్లో కూడా రియల్ ఎస్టేట్ ఎందుకు నెమ్మదించింది? ఈ అంశాన్ని కూడా గమనించాలి కదా?" అని రంగనాథ్ ప్రశ్నించారు. అసలు రియల్ ఎస్టేట్ అంటే చదరపు అడుగుకు రూ.10,000, రూ.15,000 ధరలు పెరగడం కాదని, సామాన్యుడికి, మధ్యతరగతి వారికి సొంతింటి కలను అందుబాటులోకి తీసుకురావడమే నిజమైన అభివృద్ధని ఆయన అభిప్రాయపడ్డారు. అందరికీ ఇళ్లు అందుబాటులోకి వచ్చినప్పుడే అది నిజమైన రియల్ ఎస్టేట్ అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో అమృతప్రణయ్ ప్రేమ పెళ్లికి సంబంధించి ప్రణయ్ హత్య కేసు దర్యాప్తు సమయంలో కూడా సోషల్ మీడియాలో తనపై ఇలాగే ఎన్నో ఆరోపణలు వచ్చాయని, అయినా వృత్తి ధర్మాన్ని విడిచిపెట్టలేదని రంగనాథ్ గుర్తుచేశారు. బాహ్య ఒత్తిళ్లకు తలొగ్గకుండా లక్ష్యంపైనే దృష్టి పెడితే వాస్తవాలు వాటంతట అవే బయటకు వస్తాయని ఆయన అన్నారు.

# ఆర్‌ఆర్ బీ ఉద్యోగాల జాతర..
## రైల్వే జాబ్ సాధించేందుకు సరైన సమయం ఇదే!

ఢిల్లీ, అక్టోబర్ 07 :రైల్వేలో ఉద్యోగం సాధించాలని ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఆర్‌ఆర్ బీ) శుభవార్త చెప్పింది. దేశవ్యాప్తంగా వివిధ పోస్టుల భర్తీ చేపట్టనున్నట్లు తెలిపింది. గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మొత్తం 8,050 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్ లో పేర్కొంది. ఇందులో 5 వేల గ్రాడ్యుయేట్ పోస్టులు కాగా మిగతావి అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులు. గ్రాడ్యుయేట్ పోస్టులకు అక్టోబర్ 21 నుంచి, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు అక్టోబర్ 28 ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది. జోన్లు, విభాగాల వారీగా ఖాళీల వివరాలను త్వరలో విడుదల చేయనున్న వివరణాత్మక నోటిఫికేషన్ లో వెల్లడిస్తామని తెలిపింది.

**ఏయే రీజియన్లంటే..**

సికింద్రాబాద్, చెన్నై, ముంబై, గువాహటి, గోరఖ్‌పుర్, అహ్మదాబాద్, అజ్‌మేర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, జమ్ముశ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సిలిగురి, తిరువనంతపురం.

**భర్తీ చేయనున్న పోస్టులు ఇవే..**

గూడ్స్ రైలు మేనేజర్, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్ కమ్‌టైపిస్ట్, స్టేషన్ మాస్టర్, సీనియర్ క్లర్క్ కమ్‌టైపిస్ట్, చీఫ్ కమర్షియల్ కమ్‌టికెట్ సూపర్‌వైజర్, ట్రాఫిక్ అసిస్టెంట్, అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో కమర్షియల్ కమ్‌టికెట్ క్లర్క్, అకౌంట్స్ క్లర్క్ కమ్‌టైపిస్ట్, జూనియర్ క్లర్క్ కమ్‌టైపిస్ట్, రైళ్ల క్లర్క్

**అర్హతలు..**

గ్రాడ్యుయేట్ పోస్టులకు ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత తప్పనిసరి

వయోపరిమితి..

18 నుంచి 33 సంవత్సరాలు (గ్రాడ్యుయేట్ పోస్టులు)

18 నుంచి 38 సంవత్సరాలు (అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులు)

**ముఖ్యమైన తేదీలు..**

గ్రాడ్యుయేట్ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభ తేదీ అక్టోబర్ 21, చివరి తేదీ 2025 నవంబరు 20.

అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు ప్రారంభ తేదీ అక్టోబర్ 28, చివరి తేదీ 2025 నవంబర్ 27.

# ఆన్‌లైన్‌లో నా డీప్ ఫేక్ వీడియోలు కూడా చూశాను

ఢిల్లీ, అక్టోబర్ 07 : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ డీప్‌ఫేక్ టెక్నాలజీ ప్రమాదంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో తన ముఖంతోనే సృష్టించిన పలు డీప్‌ఫేక్ వీడియోలు ప్రచారంలో ఉన్నాయని, ప్రజలను తప్పుదోవ పట్టించి, వాస్తవాలను వక్రీకరించేందుకే వీటిని రూపొందిస్తున్నారని ఆమె అన్నారు. ముంబైలో మంగళవారం జరిగిన 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025' కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్నాలజీ పెరిగేకొద్దీ ఆర్థిక మోసాల స్వరూపం కూడా పూర్తిగా మారిపోయిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇదివరకటిలా ఫైర్‌వాల్స్‌ను బద్దలు కొట్టడం కాదని, ఇప్పుడు నేరుగా ప్రజల నమ్మకాన్నే హ్యాక్ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించి నేరగాళ్లు గొంతులను అనుకరిస్తున్నారు, వ్యక్తుల గుర్తింపును క్లోన్ చేసి అచ్చం నిజమైన వీడియోల లాంటివి సృష్టిస్తున్నారు. వీటి ద్వారా ప్రజలను సులభంగా మోసం చేస్తున్నారు" అని ఆమె వివరించారు. ఇలాంటి మోసాల నుంచి పెట్టుబడిదారులను కాపాడేందుకు సెబీ, ఎన్‌పీసీఐ కీలక చర్యలు చేపట్టాయని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా సెబీలో రిజిస్టర్ అయిన బ్రోకర్ల కోసం '.brk', మ్యూచువల్ ఫండ్ సంస్థల కోసం '.mf' అనే ప్రత్యేకమైన యూపీఐ హ్యాండిల్స్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇప్పటికే 90 శాతానికి పైగా బ్రోకర్లు, అన్ని మ్యూచువల్ ఫండ్స్ ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయని చెప్పారు. అంతేకాకుండా, 'సెబీ చెక్' అనే కొత్త ఫీచర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీని ద్వారా పెట్టుబడిదారులు డబ్బు పంపే ముందే బ్రోకర్లు లేదా సంస్థల యూపీఐ ఐడీ, బ్యాంకు ఖాతా వివరాలను (అకౌంట్ నంబర్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్) వెరిఫై చేసుకోవచ్చని సూచించారు. ఈ సదుపాయం వెబ్ పోర్టల్, సార్థి యాప్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఫిన్‌టెక్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని, ఆధార్, యూపీఐ, డిజిలాకర్ వంటివి ఆర్థిక కార్యకలాపాల స్వరూపాన్నే మార్చేశాయని అన్నారు. 1.3 బిలియన్ డాలర్లతో 'ఇండియా ఏఐ మిషన్' ప్రారంభించి భారత్ గ్లోబల్ ఏఐ రంగంలోకి దూసుకెళ్లిందని ఆమె గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ ఉత్పత్తులు, సేవలకు భారత్ ఒక గ్లోబల్ హబ్‌గా మారే సత్తా ఉందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. "బాధ్యతాయుతమైన నియంత్రణ అనేది పురోగతికి అడ్డుకట్ట కాదు, అది సురక్షితమైన ప్రయాణానికి సీట్‌బెల్ట్ లాంటిది" అని ఆమె వ్యాఖ్యానించారు.

# భౌతికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్...



నోయిడా, అక్టోబర్ 07 : భౌతికశాస్త్ర విభాగంలో నోబెల్ బహుమతి 2025ని ప్రకటించారు. ఈ అత్యంత ప్రతిష్ఠాత్మక అవార్డును ముగ్గురు అమెరికన్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. జాన్ క్లార్క్, మైఖేల్ హెచ్. డివోరెట్, జాన్ ఎం. మార్టినిస్‌లను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ప్రకటించింది. అణువుల స్థాయిలో మాత్రమే సాధ్యమనుకున్న క్వాంటం భౌతికశాస్త్ర సూత్రాలను, కంటికి కనిపించేంత పెద్ద ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో విజయవంతంగా ప్రదర్శించినందుకు గాను వారికి ఈ గౌరవం దక్కింది. క్వాంటం మెకానిక్స్ ప్రకారం, ఒక కణం తనకు అడ్డుగా ఉన్న గోడను సైతం దాటుకుని వెళ్ళగలదు. దీనినే 'టన్నెలింగ్' అంటారు. అయితే ఇలాంటి వింత ప్రవర్తనలు కేవలం సూక్ష్మ ప్రపంచానికే పరిమితమని ఇప్పటివరకు భావించేవారు. కానీ, ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు 1984-85 మధ్యలో చేసిన ప్రయోగాలతో ఈ అభిప్రాయాన్ని మార్చేశారు. వారు సూపర్ కండక్టర్లతో, మధ్యలో ఒక విద్యుత్ నిరోధక పొర (జోసెఫ్‌సన్ జంక్షన్) ఉండేలా ఒక ప్రత్యేకమైన ఎలక్ట్రిక్ సర్క్యూట్‌ను రూపొందించారు. ఈ సర్క్యూట్‌లో విద్యుత్‌ను ప్రవహింపజేసినప్పుడు, అందులోని కణాలన్నీ కలిసి ఒకే 'స్థూల కణం'గా ప్రవర్తించడాన్ని వారు గమనించారు. ఈ స్థూల కణం, ఎలాంటి అడ్డంకి లేకపోయినా క్వాంటం టన్నెలింగ్ ద్వారా సున్నా వోల్టేజ్ స్థితి నుంచి బయటపడటాన్ని వారు నిరూపించారు. అలాగే, ఈ వ్యవస్థ నిర్దిష్ట పరిమాణంలో మాత్రమే శక్తిని గ్రహించడం లేదా విడుదల చేయడాన్ని (ఎనర్జీ క్వాంటైజేషన్) కూడా ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ ఆవిష్కరణపై నోబెల్ కమిటీ ఛైర్ ఓల్ ఎరిక్సన్ స్పందిస్తూ, "శతాబ్దాల నాటి క్వాంటం మెకానిక్స్ నిరంతరం కొత్త ఆశ్చర్యాలను అందిస్తుండటం అద్భుతంగా ఉంది. అన్ని డిజిటల్ టెక్నాలజీలకు క్వాంటం మెకానిక్సే పునాది కాబట్టి ఇది ఎంతో ఉపయోగకరం" అని తెలిపారు. ఈ పరిశోధనలు క్వాంటం కంప్యూటర్లు, క్వాంటం సెన్సార్లు, క్వాంటం క్రిప్టోగ్రఫీ వంటి భవిష్యత్ టెక్నాలజీల అభివృద్ధికి మార్గం సుగమం చేస్తాయని శాస్త్ర ప్రపంచం భావిస్తోంది.

# బీసీ రిజర్వేషన్ల అంశంపై రేవంత్ రెడ్డి ఫుల్ ఫోకస్..

బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. సామాజిక న్యాయం దిశగా చారిత్రాత్మక నిర్ణయంగా భావిస్తున్న ఈ వ్యవహారంలో ఏ మాత్రం నిర్లక్ష్యం జరగకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. సుప్రీంకోర్టు నుంచి హైకోర్టు దాకా ప్రతి దశలోనూ బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తన పూర్తి శక్తిని వినియోగిస్తోంది. ఇటీవల సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలంగాణ తరపున ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింఘ్వి, సిద్ధార్థ దవే లు హాజరై వాదనలు వినిపించారు. ఈ విచారణకు ముందే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశాలు ఇవ్వడంతో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లతో కూడిన బృందం ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చించింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా భట్టి విక్రమార్క, మంత్రుల బృందం స్వయంగా సుప్రీంకోర్టు విచారణను ప్రత్యక్షంగా పర్యవేక్షించింది. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వి తో ఫోన్‌లో మాట్లాడారు. రేపు (బుధవారం) హైకోర్టులో జరగనున్న బీసీ రిజర్వేషన్ల కేసు విచారణకు స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని ఆయన కోరారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఢిల్లీలో సింఘ్విని కలిసి అదే విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత సున్నితమైనదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించాలని వారు కోరారు. హైకోర్టులో రేపు జరగనున్న విచారణకు ముందు, కేసు పురోగతిపై సమగ్ర సమీక్ష జరపాలని సీఎం నిర్ణయించారు. ఈ క్రమంలో ఈరోజు సాయంత్రం 4:30 గంటలకు హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొననున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం సామాజిక సమతుల్యతకు సంబంధించిన కీలకమైన అంశమని ప్రభుత్వం భావిస్తోంది. కేసు పురోగతిని గంట గంటకు పర్యవేక్షిస్తూ, న్యాయపరంగా ఏ మార్పులు వచ్చినా తక్షణమే వ్యూహాన్ని సవరించుకునేలా ప్రత్యేక టీమ్‌ను సీఎం రేవంత్ ఏర్పాటు చేశారు. న్యాయ పోరాటంతో పాటు రాజకీయ, సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి.

# భారత్ కు విద్యుత్ విక్రయిస్తూ భారీగా ఆదాయం ఆర్జిస్తున్న నేపాల్

అక్టోబర్ 07 : భారీ వరదలు, కొండచరియలు విరిగిపడటంతో పలు జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నప్పటికీ, పొరుగు దేశాలకు విద్యుత్ ఎగుమతుల విషయంలో హిమాలయ దేశం నేపాల్ ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఈ ఆర్థిక సంవత్సరం (202526) జూలై మధ్యలో ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు భారత్, బంగ్లాదేశ్‌లకు కరెంట్ విక్రయించి ఏకంగా 15 బిలియన్ల నేపాలీ రూపాయలు (భారత కరెన్సీలో సుమారు రూ.937 కోట్లు) ఆర్జించింది. నేపాల్ ఇంధన శాఖ మంత్రి కుల్ మాన్ ఘిసింగ్ కార్యాలయం ఈ వివరాలను అధికారికంగా వెల్లడించింది. ఇటీవల వరదల వల్ల దెబ్బతిన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల పరిస్థితిని సమీక్షించేందుకు లోడ్ డిస్పాచ్ సెంటర్‌ను సందర్శించిన అనంతరం ఈ ప్రకటన విడుదల చేశారు. సుమారు 1000 మెగావాట్ల విద్యుత్‌ను పొరుగు దేశాలకు విక్రయించడం ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు తెలిపారు. దేశీయ అవసరాలు తీరిన తర్వాత మిగులు విద్యుత్‌ను ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ ద్వారా భారత్‌కు నేపాల్ విక్రయిస్తోంది.

# చరిత్ర మరువని యోధుడు కొమరం భీమ్

* **బిఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు సిలివేరిసత్యనారాయణ**

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: చరిత్ర మరువని యోధుడు కొమరం భీమ్ అని బిఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు సిలివేరిసత్యనారాయణ అన్నారు. ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీమ్ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే , బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ హరిప్రియ నాయక్ ఆదేశాల మేరకు భారత రాష్ట్ర సమితి ఇల్లందు పట్టణ , మండల ముఖ్య నాయకుల పార్టీ శ్రేణులతో కలిసి బిఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, ఇల్లందు పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వరరావు ఇల్లందు పట్టణంలోని స్థానిక కొత్త బస్టాండ్ వద్ద గల కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, ఇల్లందు పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీ, దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన మహోన్నత వ్యక్తి కొమురం భీమ్ అని అన్నారు. జల్ జంగిల్ జమీన్' నినాదానికి ప్రతీకగా నిలిచిన యోధుడు కొమరం భీమ్ అని కొనియాడారు. కొండ కోనల్లో, ప్రకృతితో సహ జీవనం సాగించే ఆదివాసీ ప్రజలకు అడవిపై హక్కు సామాజిక న్యాయంలో భాగమని నినదిస్తూ, 1928 నుంచి 1940 వరకూ రణభేరి మోగించిన కొమరం భీమ్ నైజాం సర్కార్ గుండెల్లో సింహ స్వప్నంగా మారిన పోరాటయోధుడు కొమురం భీం అని గుర్తు చేసుకున్నారు. ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక కొమరం భీమ్ అని, స్వయం పాలన




అస్తిత్వ ఉద్యమాలకు వేగుచుక్క కొమరం భీమ్ అని కొనియాడారు. అటువంటి మహనీయునికి ఇవే మా ఘన నివాళులు అని గుర్తు చేసుకుంటూ నివాళులర్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ మహిళా అధ్యక్షురాలు నెమలి ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కొక్కు సరిత, ఉపాధ్యక్షురాలు కడగండ్ల నారాయణమ్మ, పింకీ లోదు, ఇల్లందు మండల మహిళా విభాగం వడ్డేపల్లి రాజేశ్వరి,సోషల్ మీడియా , యువజన నాయకులు. గిన్నారపు రాజేష్, సత్తాల హరి కృష్ణ, కొంటూ రవికాంత్, ఇల్లందు మండల, పట్టణ మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎస్.కె గాజి, మసూద్ రబ్, ఇల్లందు పట్టణ నాయకులు సామల రవితేజ, నంద ప్రవీణ్, దుంపటి కృష్ణ, వర రమేష్, బజారు సత్యనారాయణ, ఇల్లందు మండల నాయకులు ముస్తఫా, సదరం మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేటీఆర్ ని కలిసిన కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ నందినగర్ నివాసం చేరుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం : జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ వాల్మీకి మహర్షి ఆదికవి అని విశ్వవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మహానుభావుడు. ఆయన చెప్పిన హితోక్తులు, జీవన నియమాలు ప్రతి మనిషి ఆచరిస్తే సమాజం సుఖసంతోషాలతో నిండుతుంది. ఆయన రచించిన రామాయణం మనకు ఆచరణీయమైన జీవన గాధ అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, కన్వీనర్ పి. విజయలక్ష్మి సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొదుమూరి సత్యనారాయణ, ముదురుకోళ్ల కిషోర్, వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షులు మురికి వెంకన్న, బి. నందకిశోర్, మురికి శ్రీనివాస్, కె. సాంబయ్య, గుమలాపురం సత్యనారాయణ, జిల్లా కార్యాలయ సిబ్బంది, వాల్మీకి బోయ సంఘం సభ్యులు తదితర నాయకులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై దాడి అమానుషం

* **దాడికి ప్రయత్నించిన దుండగున్నీ కఠినంగా శిక్షించాలి : బోయ రాములు**



చౌటుప్పల్, ప్రజా స్ఫూర్తి: భారత న్యాయ వ్యవస్థకు గుండెకాయ లాంటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జస్టిస్ గవాయిపై దాడికి ప్రయత్నించిన దుండగుడు రాకేష్ కిషోర్ ను కఠినమైన శిక్షించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బోయ రాములు డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి ప్రయత్నించడం భారత రాజ్యాంగాన్ని, న్యాయ వ్యవస్థను కించపరచడానికి కుట్ర పందినట్టుగా భావిస్తున్నామన్నారు. ఈ విధమైన దుశ్చర్య యావత్ భారతదేశ ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవాలను కించపరిచేలా వ్యక్తం అవుతుందని ఆరోపించారు. వెంటనే ఆ దుండగుని పై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## జస్టిస్ బీఆర్ గవాయ్ పై దాడి
# భారత రాజ్యాంగాన్ని అవమానించడమే

* **సి జె ఐ పై జరిగిన దాడికి సిపిఎం ఖండన**
* **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భారత న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పై న్యాయవాది రాజేశ్ కిషోర్ చెప్పు విసిరి దాడి చేయడాన్ని సీపీఐ(ఎం) జిల్లా కమిటి తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు జిల్లా కార్యదర్శి కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ దాడి దిగ్భ్రాంతికరమని తెలియజేశారు. అతన్ని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. రాజ్యాంగ పరిధిలో రాజ్యాంగానికి అనుగుణంగా న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులు తీర్పులివ్వడం, వ్యాఖ్యానాలు చేసే వైఖరి ఉంటుందని తెలిపారు. కానీ మనువాద, మతోన్మాద, ఆధిపత్య ధోరణులకు, సనాతన ధర్మానికి, లేదా ఇతర మతాలకు అనుకూలమైన రీతిలో తీర్పులుండాలనే రెచ్చగొట్టే వైఖరి సరైందికాదని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న వైఖరి వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. ఇది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక శక్తులను అవమానించే ఘటన అని తెలిపారు. కుల అసమాతనలు, మతోన్మాద రాజకీయాలు, మూఢ విశ్వాసాన్ని పెంచి పోషించే విధంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ తన నాయకులు, మంత్రులు, ముఖ్యమంత్రులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలకు భయపడే సమస్య లేదంటూ ప్రధాన న్యాయమూర్తి చెప్పడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. కుల, మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నీ, సామాజిక న్యాయం కోరే, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడే శక్తులన్నీ ఐక్యంగా నిలబడి పోరాడాల్సిన అవసరముందని పేర్కొన్నారు.ప్రజలు కూడా స్పందించి ఇలాంటి దాడులను సంఘటితంగా వ్యతిరేకించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## సి.జె.ఐ పై దాడిని ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: సి.జె.ఐ పై దాడిని నిరసిస్తూ మంగళవారం పి.డి.ఎస్.యు ఎస్.ఎఫ్.ఐ పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో జెకె కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి బి.అభిమన్యు, పి.డి.ఎస్.యు జిల్లా కార్యదర్శి డి. ప్రణయ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.విజయ్, జె.గణేష్ మాట్లాడారు.నిన్నటి రోజున దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో కేసు విచారణ జరుగుతున్న సమయంలో జస్టిస్ గవాయి పై లాయర్ రాకేష్ కిషోర్ చెప్పు విసరటం, సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించబోమంటూ నినాదాలు చేయడం రాజ్యాంగం మీద దాడినని రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని అని వారు పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని మతతత్వ సంస్థలు భారత రాజ్యాంగం స్థానంలో మను ధర్మ శాస్త్రాన్ని తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్న సందర్భంలో ఈ సంఘటనలన్నీ కూడా అందుకు ఊతమిచ్చేలా ఉన్నాయి. దేశంలో ఇప్పటికే మతోన్మాద దాడులు తీవ్రంగా జరుగుతున్న సమయాన సాక్షాత్తు సుప్రీంకోర్టులో జడ్జిపై దాడి జరగడం అంటే మతోన్మాద దాడులు ఎంతటి స్థాయికి చేరుతున్నాయో అర్థం చేసుకోవాలని జస్టిస్ గవాయి పై జరిగిన దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని లాయర్ రాకేష్ పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిషన్, అరుణ్, ప్రవీణ్, శివ, పి.డి.ఎస్.యు నాయకులు వెంకటేష్, సతీష్, విక్రమ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గవాయిపై దాడి చేసిన వారిపై దేశద్రోహం కేసు పెట్టాలి

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భారత దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై షూ విసిరి ఆయనపై దాడికి పాల్పడిన వ్యక్తిపై దేశ ద్రోహం కేసు పెట్టాలని వక్తలు డిమాండ్ చేశారు. బహుజన సంఘాల కన్వీనర్ తాండ్ర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొత్తగూడెం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన వక్తలు మాట్లాడుతూ జస్టిస్ గవాయి పై జరిగిన దాడి భారతదేశ 140 కోట్ల మంది ప్రజలపై , భారత రాజ్యాంగంపై దాడి అని కావాలని ప్రధాన న్యాయమూర్తి పై దాడికి కుట్రచేశారని ఒకవేళ ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో పౌర సమాజం ఏకధాటి పైకి వచ్చి రాజ్యాంగాన్ని రాజ్యాంగ శక్తులను రక్షించుకుంటామని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ బాలశౌరి,జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుసపాటి శ్రీనివాస్ టిఎంఆర్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా రమేష్ కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు లోగాని శ్రీనివాస్ సింగరేణి ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ ప్రధాన కార్యదర్శి అంతోటినాగేశ్వరరావు, ఐ ఎల్ పి ఏ అధ్యక్షులు గోపికృష్ణ పౌర హక్కుల సంఘం నాయకులు ఉపేందర్ మారుపాక రమేష్ సాదిక్ పాషా అడ్వకేట్లు భానుప్రియ షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పూల రవీందర్



న్యూ డెమోక్రసీ జిల్లా సెక్రెటరీ గౌని నాగేశ్వరరావు, ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి సంజీవ్, బీసీ నాయకులు బండి రాజు గౌడ్, ప్రభాకర్, అంకినీడు ప్రసాద్, మహిళా నాయకులు మేదిని లక్ష్మి,దంసలపూడి భాస్కర్,బామ్ సేఫ్ నాయకులు సాగర్,బండి పల్లి కిరణ్,శివ,కొప్పుల రమేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు

## జగద్గిరి నగర్ లో విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

* **కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జె.కె. శేఖర్ యాదవ్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : బస్తీలలో నెలకొన్న విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జె.కె. శేఖర్ యాదవ్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరి నగర్ లో ఉన్న కరెంట్ సమస్యలను పరిష్కరించాలని ఎలక్ట్రికల్ డీఈ జాన్ రాజు దృష్టికి తీసుకెళ్లగా వారు మంగళవారం ఉదయం జగద్గిరి నగర్ లో ఉన్న ట్రాన్స్ఫార్మర్స్ , కేబులు లైన్లను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తానని బస్తివాస్తులకు హామీ ఇచ్చారు. శేఖర్ యాదవ్ మాట్లాడుతూ సమస్యలు వారి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే స్పందించి ఈరోజు ఉదయం బస్తిలో పర్యటించి అన్ని కరెంట్ సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చినందుకు వారికి అభినందనలు తెలియజేశారు. ఇలాంటి అధికారులు ఉంటే ప్రజలకు సమస్యలు రాకుంట చూస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఏడీఈ శ్రీకాంత్, ఎఈ రాధాకృష్ణ, లైన్మెన్ కుమార్ , బస్తి అధ్యక్షులు జగన్ ముదిరాజు , ప్రధాన కార్యదర్శి ముత్యాలు, ఉపాధ్యక్షులు నాగరాజు ,రవి , సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ వ్యవస్థపై మతోన్మాదుల దాడిని కండించాలి

* **దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి**
* **సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం : భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ పై మతోన్మాద ముసుగులో ఉన్న న్యాయవాది జరిపిన దాడి ప్రజాస్వామ్య పునాదులపై జరిగిన దాడి అని, ఈ దాడిని భారతీయ సమాజం ముక్తకంఠంతో కండించాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ న్యాయస్థానంలో జరిగిన దాడిని నిరసిస్తూ సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పోస్టాఫీసు సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, న్యాయవ్యవస్థకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేశ న్యాయవ్యవస్థకు ప్రతీక అని, ఆయనపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్య పునాదులపై దాడి చేయడమేనని, ఇలాంటి సంఘటనలు న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీస్తాయని అన్నారు. ప్రభుత్వం తక్షణం దాడి వెనుక ఉన్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం చెప్పే గొంతుకలను బెదిరించడం, దాడులకు పాల్పడటం సరైది కాదని, న్యాయవాదులకు, న్యాయమూర్తులకు రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వానిదేనని, జరిగిన సంఘటనపై ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో గనిగళ్ల వీరాస్వామి, వాసిరెడ్డి మురళి, జిల్లా సమితి సభ్యులు కె రత్నకుమారి, గౌనె మని, నాయకులు మర్రి గోపి, మాచర్ల శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్, షహీన్, పుట్టి భాగ్యలక్ష్మి, కైసర్, కత్తెర రాములు, కె ధర్మరాజు, గౌనె సురేష్, గుత్తుల శ్రీనివాస్, బాదావత్ రంజీ, మండల రాజు తదితరులు పాల్గొన్నారు.

# సదరమ్ క్యాంపులో నరకయాతన







* ఇబ్బందులు పడ్డ దివ్యాంగులు
* తిరగని ఫ్యాన్లు తిప్పలు, కూర్చునేందుకు కుర్చీలు లేక నేలపైనే నిరీక్షణ
* సిబ్బందిపై ఆగ్రహం

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అర్హులైన దివ్యాంగులను గుర్తించి సదరమ్ సర్టిఫికెట్లు అందించేందుకు ఏర్పాటు చేసిన సదరమ్ క్యాంపులో సౌకర్యాల లేమితో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు, వారి బంధువులకు కనీసం కూర్చునేందుకు కుర్చీలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో కొందరు నేలపై కూర్చోవాల్సి వచ్చింది. ఒకవైపు వాతావరణం వేడిగా ఉండగా, ఫ్యాన్లు తిరగక ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం సదరమ్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపునకు జిల్లాలోని భద్రాచలం, పినపాక, మణుగూరు, ఇల్లందు, పాల్వంచ, జూలూరుపాడు, చంద్రుగొండతోపాటు కొత్తగూడెం వంటి పలు ప్రాంతాల నుంచి దివ్యాంగులు వందల సంఖ్యలో తరలి వచ్చారు. మెడికల్ చెకప్ కోసం సదరమ్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా,



కొందరికి ఆ విషయం తెలియకపోవడంతో నేరుగా క్యాంపునకు రావడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అంతేకాక కొందరికి ఒక అవయవలోపం ఉండగా, ఆన్‌లైన్ సమయంలో మరో లోపం ఉన్నట్లుగా నమోదు చేయడంతో సదరమ్ క్యాంపునకు వచ్చి అవస్తలు పడ్డారు.

**తిరగని ఫ్యాన్లు తో తిప్పలు. కుర్చీలు లేక నేలపైనే పడిగాపులు**

సదరమ్ క్యాంపు ఏర్పాటు చేసిన సందర్భంలో దూర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో దివ్యాంగులు, వారి బంధువులు వచ్చే అవకాశం ఉన్నందున సరిపడా టెంట్లు, కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా, మంగళవారం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రం అటువంటి సౌకర్యాలు ఏవీ కల్పించలేదు. కూర్చునేందుకు కుర్చీలు లేకపోవడంతో దివ్యాంగులు వారికి బల్లా దొరికిన చోటకు వెళ్లి కూర్చున్నారు. డాక్టర్లు పరీక్షించే గది బయట పదుల సంఖ్యలో దివ్యాంగులు వేచి ఉన్నప్పటికీ వారికి కనీసం ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. అంతేకాక తాగేందుకు మంచినీటి సౌకర్యం కూడా కల్పించకపోవడంతో ఆస్పత్రి సిబ్బందిపై దివ్యాంగులు, వారి బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమి నిర్వహణ అంటూ సిబ్బందిని నిలదీశారు. సమాచార కేంద్రం కూడా లేకపోవడంతో సదరమ్ క్యాంపులో మెడికల్ చెకప్ కోసం వచ్చిన వారు ఎక్కడికి వెళ్లి, ఎవరిని కలవాలని అనే సందిగ్ధం నెలకొంది. వారిని.. వీరిని అడుగుతూ క్యాంపు నిర్వహణ ప్రాంతానికి వెళ్తే వైద్యులు ఆలస్యంగా రావడం, కొన్ని రకాల జబ్బులకు మరొకరోజు క్యాంపు నిర్వహిస్తాం, ఆ రోజు రావాలంటూ వెనక్కి పంపించేశారు. సౌకర్యాల లేమిపై సిబ్బందిని ప్రశ్నించినా వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఇకనైనా సదరమ్ క్యాంపుల్లో దివ్యాంగుల అవసరాలను గుర్తించి, దూర ప్రాంతాల నుంచి వచ్చే బంధువుల ఇబ్బందులు తెలుసుకుని వారికి టెంట్లు, కుర్చీలు, ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యంతోపాటు సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## సునీతమ్మ గెలుపుతో జూబ్లీహిల్స్ లో మళ్లీ గులాబీ జెండా ఎగురాలి

* బిఆర్ఎస్ ఎల్పీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్



జూబ్లీహిల్స్, (ప్రజాస్ఫూర్తి) : అన్నా నగర్" బస్తీని నిలబెట్టింది గోపన్ననేనని..... సునీతమ్మ గెలుపుతో జూబ్లీహిల్స్ లో మళ్లీ గులాబీ జెండా ఎగురాలని బోరబండ డివిజన్ ఇంచార్జ్, బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ డివిజన్ లోని అన్నా నగర్ లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, బిఆర్ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రజల సంక్షేమం, అభివృద్ధికి గోపీనాథ్ గారు చేసిన సేవలను ప్రజలు స్మరించుకున్నారు.అనంతరం వారు మాట్లాడుతూ మరోమారు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలను నయవంచన చేసేందుకు ప్రచారం పేరుతో తిరుగుతున్న కాంగ్రెస్ నాయకులకు "బాకీ కార్డు" చూపించి ఆరు గ్యారంటీల అమలుపై నిలదీయాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాగంటి గోపీనాథ్ కుమారుడు మాగంటి వాత్సల్యనాథ్, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు క్రిష్ణ మోహన్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు విజయ్ కుమార్, వసంత రావు, మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. లేట్ నైట్ వారికోసమే..!



ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ శుభవార్త చెప్పింది. లేట్ నైట్ మీటింగ్స్ ఉన్నాయా..? సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణానికి హైదరాబాద్ మెట్రో మీతోనే ఉంది. రాత్రివేళ సమావేశాలు, ఆఫీస్ పనులు ఆలస్యమైనా ఇక ఆందోళన అవసరం లేదు. ఈ మేరకు మంగళవారం ఎక్స్ వేదికగా @ltmhyd ఎల్ & టీ హైదరాబాద్ మెట్రో రైలు ఆసక్తికర ట్వీట్ చేసింది. హైదరాబాద్ మెట్రో ఇప్పుడు వారంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు రాత్రి 11:45 గంటలకు చివరి రైలు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. దీంతో ప్రయాణికులు ఇక తొందరపడకుండా సురక్షితంగా, సౌకర్యంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చని తెలిపింది. రాత్రి వేళల్లో కూడా ప్రయాణికుల భద్రత కోసం అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయి.

## ఆర్యవైశ్య కార్పొరేషన్ జిల్లా ఇంచార్జిగా పొద్దుటూరి నాగేశ్వరరావు నియామకం

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి, ఆర్యవైశ్య సంఘం ఇల్లందు మండల అధ్యక్షులు పొద్దుటూరి నాగేశ్వరరావు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకంతో జిల్లా ఆర్యవైశ్య సమాజం ఉత్సాహంలో మునిగిపోయింది.జిల్లాలో ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తూ, సేవా కార్యక్రమాల్లో ముందుండే నాగేశ్వరరావు కు ఈ కీలక పదవి లభించడం పట్ల ఇల్లందు ఆర్యవైశ్యులు, పట్టణ ప్రముఖులు, వ్యాపార వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పొద్దుటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నియామకం నా జీవితంలో మరో బాధ్యతతో కూడిన సవాలు అన్నారు. నాపై నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పగించిన కల్వ సుజాత కి, నా వెన్నంటి నిలిచిన ఆర్యవైశ్య సమాజానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఆర్యవైశ్యుల సంక్షేమం, విద్య, ఉపాధి రంగాల్లో నూతన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తాను అని అన్నారు. నాగేశ్వరరావుకు ఆర్యవైశ్య సంఘంలో జిల్లా స్థాయిలో కీలక పదవి లభించిన నేపథ్యంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం జిల్లా



ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల చంద్రశేఖర్, కండె రమేష్, పట్టణ, యువజన సంఘం అధ్యక్షులు అర్వపల్లి రాధాకృష్ణ, నరేంద్రుల అను, కండె రమేష్,యెలుగూరి మధుబాబు, గందె సురేష్, సైఫా రాజశేఖర్, కొప్పురావు భాస్కర్ రావు, గౌరిశెట్టి పురుషోత్తం, చందా భద్రం, పసుమర్తి లక్ష్మణ్ రావు, అయితా శ్రీనివాసరావు, తాటిపల్లి సుబ్బారావు, దివ్వెల నాగేశ్వరరావు, వ్యామసాని రవి, పసుమర్తి వాసు, కటకం బాలకృష్ణ, తేలుకుంట్ల రజనీకాంత్, చందా చక్రధర్, పుల్లూరు సతీష్, రామిడి శంకర్, పవన్, సాత్విక్, సతీష్, ఆనంద్ రావు, రాకేష్, గౌరిశెట్టి నగేష్ తదితరులు నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు.



## సంస్కృత సాహిత్యంలో పేరెన్నికగల కవి వాల్మీకి మహర్షి

* పీఏసీ చైర్మన్ , శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : సంస్కృత సాహిత్యంలో పేరెన్నికగల కవి వాల్మీకి మహర్షి అని పీఏసీ చైర్మన్ , శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆదికవి శ్రీ శ్రీ శ్రీ వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ జన్మభూమి కాలనీ లో శ్రీ వాల్మీకి బోయ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలలో ఆయన తో పాటు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి లు పాల్గొని పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రపంచానికి పరమ పవిత్రమైన రామాయణాని వరంగా ఇచ్చిన ఆదికవి శ్రీ శ్రీ శ్రీ వాల్మీకి మహర్షి అని అన్నారు. మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వాల్మీకి జయంతి ని పర్గత్ దివస్ అని కూడా పిలుస్తారని, వాల్మీకి మహర్షి గొప్ప వ్యక్తి అని రామాయణాన్ని వ్రాశాడు అని,ఈయన్ని సంస్కృతభాషకు ఆదికవిగా గుర్తిస్తారన్నారు. వాల్మీక రామాయణంగా అందరికీ తెలిసిన వాల్మీకంలో 23 వేల శ్లోకాలు 7 కాండాలుగా (ఉత్తరకాండ సహా) విభజించబడి ఉన్నాయి . రామాయణంలో 4 లక్షల ఎనభై వేల పదాలు ఉన్నాయి. ఇది మహాభారత కావ్యంలో దాదాపుగా పావు వంతు భాగం అని, రామాయణం భారతీయ వాఙ్మయంలో ఆదికావ్యం గాను, దానిని సంస్కృతంలో రచించిన వాల్మీకి మహాముని ఆదికవిగాను సుప్రసిద్ధం అని, గొప్ప కవి అని , ఆయన జీవితం ఎంతో మందికి ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బిజెపి అభ్యర్థుల గెలిపే లక్ష్యంగా కృషి చేయాలి

- మునుగోడు నియోజకవర్గం స్థానిక సంస్థల సమీక్ష సమావేశం
- గంగిడి మనోహర్ రెడ్డి

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలిపి లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం శివారులోని రిక్కల సతిరెడ్డి ఫంక్షన్ హాల్ లో మునుగోడు నియోజకవర్గం స్థానిక సంస్థల సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ జి మనోహర్ రెడ్డి, బిజెపి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలో 7జెడ్పిటిసి, 7ఎంపీపీ, 72ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయడానికి అభ్యర్థులను నియమించడం జరిగిందన్నారు. అదేవిధంగా అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఇంటింటా ప్రచారం చేయాలని సూచించారు. బిజెపి అభ్యర్థుల ప్రచారంలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొనాలన్నారు. బిజెపి పార్టీ ప్రతి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో శాగ చంద్రశేఖర్ రెడ్డి, బచ్చనగోని దేవేందర్, బిక్షం గౌడ్, అశోక్, కడారి కల్పన, సుర్వి రాజు గౌడ్, పందుల సత్య గౌడ్, పెంబల జానయ్య, రావుల ఎల్లప్ప, రాజేందర్, ఆంజనేయులు, పాలకూర్ల జంగయ్య గౌడ్, గుజ్జుల సురేందర్ రెడ్డి, భవనం మధుసూదన్ రెడ్డి, రమణగోని శంకర్, ఊడుగు యాదయ్య గౌడ్, బత్తుల జంగయ్య గౌడ్, చినుకని మల్లేష్ యాదవ్, సాయిలు, కృష్ణ, కాయితీ రమేష్ గౌడ్, సిల్వర్ దుర్గయ్య, అశోక్, దిండు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## 'అలా చేస్తే ఊరుకోం.. స్తంభింపచేస్తాం'

**: రేవంత్ సర్కార్‌కు కవిత హెచ్చరిక**



గ్రూప్ 1 నియామకాల్లో సుప్రీంకోర్టు ఆదేశాలను తెలంగాణ ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. ఫలితాలు ప్రకటించి నియామక పత్రాలు అందజేసినా... వారికి ఆ ఉద్యోగాలపై ఎలాంటి హక్కులేదని సర్వోన్నత న్యాయస్థానం ప్రకటించింది అంటే ఈ మొత్తం ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని తప్పులు చేసిందో స్పష్టమవుతోంది. దీనినే సుప్రీంకోర్టు ఎత్తిచూపింది. గ్రూప్ 1 ఉద్యోగ నియామకాల వివాదం న్యాయ స్థానాల్లో తేలేవరకు అభ్యర్థుల మెయిన్స్ ఆన్సర్ షీట్లను తొందరపడి డిస్పోజ్ చేయొద్దని అన్నారు. గ్రూప్ 1 నోటిఫికేషన్ నుంచి ఫలితాల ప్రకటన వరకు తెలంగాణ ప్రభుత్వం అనేక తప్పులు చేసింది.. ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను తుంగలో తొక్కింది.. న్యాయస్థానాలు తుది తీర్పు ఇచ్చేలోపు ప్రభుత్వం అభ్యర్థుల మెయిన్స్ ఆన్సర్ షీట్లను డిస్పోజ్ చేస్తే నిరుద్యోగులతో కలిసి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను స్తంభింపజేస్తామని కల్వకుంట్ల కవిత హెచ్చరించారు.

## పెంచినవి తగ్గించేదాకా పోరాటం చేస్తాం

పెంచిన బస్ చార్జీలు వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డి.సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ డిమాండ్ చేశారు. చార్జీల భారం ప్రయాణికులపై ఎలా ఉందో ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు వారు మంగళవారం ఉదయం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి అసెంబ్లీ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. చార్జీల పెంపుపై ప్రయాణికులు తమ నిరసన వ్యక్తం చేశారు. పేదలపై నెలకు రూ.500 దాకా అదనపు భారం పడుతున్నదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎమ్మెల్యేలతో కలిసి ప్రయాణికులు నినాదాలు చేశారు. అసెంబ్లీ దగ్గర బస్సు దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బస్టాప్‌లో మీడియాతో మాట్లాడారు. సామాన్య ప్రజలపై చార్జీల మోతతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల వ్యతిరేక సర్కార్ అని రుజువైందని అన్నారు. ఇప్పటికే వాహనాల పన్ను పెంచారని.. మద్యం ధరలు పెంచారని.. ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ చార్జీల పెంపునకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మార్పుమార్పు అంటే సామాన్య ప్రజలపై అధిక భారం మోపడమేనా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ పేదల పక్షాన పోరాడుతూనే ఉంటుందని.. చార్జీలు దించేదాకా ఒత్తిడి పెంచుతుందని వారు స్పష్టం చేశారు.

# సమ్మక్క-సారలమ్మ విశ్వవిద్యాలయం లోగో ఆవిష్కరించిన కేంద్రమంత్రులు

ఢిల్లీ: కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, కిషన్‌రెడ్డి ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమ్మక్క, సారలమ్మ కేంద్ర విశ్వవిద్యాలయం లోగోను ఆవిష్కరించారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ సమ్మక్క సారలమ్మ పండుగ జరుపుకోనున్న సందర్భంగా... వారి పేరుతో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించిందని, భవనాల నిర్మాణం త్వరితగతిన ప్రారంభించాలని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని కోరినట్టు చెప్పారు. యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ధర్మేంద్ర ప్రధాన్‌కి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. ప్రధాని దూరదృష్టి, కిషన్‌రెడ్డి చొరవతో తెలంగాణలో గిరిజనుల కోసం ప్రత్యేక యూనివర్సిటీ ఉండాలనే కల నిజమైందన్నారు. ''వర్సిటీ కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.800 కోట్లకు పైగా నిధులు కేటాయించింది. తెలంగాణ సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల వారికి కూడా ఈ యూనివర్సిటీ సేవలందిస్తుంది. స్థానిక ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా కొత్త కోర్సులు తీసుకురావాలి. నూతన పరిశోధనలు, సృజనాత్మకతకు వేదికగా మార్చాలి. ఎంతో విలువైన భారతీయ ఆయుర్వేద విలువలు, గిరిజనుల ఆహారం గురించి కోర్సుల్లో చేర్చేలా చర్యలు తీసుకోవాలి. గిరిజన భాషల్లో కూడా పాఠ్యాంశ బోధన ఉండాల్సిన అవసరముంది. ములుగు పరిసర ప్రాంతాల్లో యువత క్రీడా నైపుణ్యం ఉంటుంది, వారు క్రీడల్లో రాణించేలా చొరవ తీసుకోవాలి. వర్సిటీ లోగో రూపకల్పనలో సృజనాత్మకత ఇమిడి ఉంది. పలు తెగల భాషలకు సంబంధించిన పదాలను లోగోలో వాడటం చాలా అద్భుతమైన నిర్ణయం'' అని ధర్మేంద్రప్రధాన్ అన్నారు.



## కాంగ్రెస్ నేత ఓటరు కార్డులు పంపిణీ చేయడం ఏంటి? : కేటీఆర్

హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేత ఓటరు కార్డులు పంపిణీ చేయడంపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఉప ఎన్నిక టికెట్ ఆశావహుడు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్నారని, పంపిణీ చేయడానికి ఆయనెవరని ప్రశ్నించారు. కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తమ శాఖ బాధ్యతలు అప్పగించిందా అని మండిపడ్డారు. రాహుల్ గాంధీ చెబుతున్న ఓట్ చోరీ కంటే ఇది పెద్ద నేరం కాదా? అని కేటీఆర్ నిలదీశారు.



## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి పోటీలో లేను

**: బొంతు రామ్మోహన్**

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి పోటీలో తాను లేనని మాజీ మేయర్, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొంతు రామ్మోహన్ తెలిపారు. తనకు టికెట్ కావాలని ఎవర్నీ అడగలేదని, అధిష్ఠానమే అభ్యర్థిని నిర్ణయిస్తుందని చెప్పారు. టికెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా కాంగ్రెస్ గెలుపు కోసం పని చేస్తానని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని ఎంపిక చేయడానికి నలుగురి పేర్లను ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పీసీసీ) ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. సీఎం సూచనలతో నవీన్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డిల పేర్లను అధిష్ఠానానికి పంపింది. వీరిలో ఒకరి పేరును ఏఐసీసీ అధికారింగా ప్రకటించనుంది.



## కాళేశ్వరం కమిషన్ నివేదికపై పిటిషన్లపై విచారణ వాయిదా



హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్ నివేదికపై దాఖలైన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు నవంబర్ 12వ తేదీకి వాయిదా వేసింది. కౌంటర్ దాఖలుకు రాష్ట్ర ప్రభుత్వం సమయం కోరింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన తర్వాత రిప్లై కౌంటర్ దాఖలు చేయాలని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎస్.కె. జోషి, స్మితా సబర్వాల్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మధ్యంతర ఉత్తర్వులను నవంబర్ 12 వరకు పొడిగించింది.

## అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను: మంత్రి పొన్నం

హైదరాబాద్: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వ్యాఖ్యలపై తాను స్పందించనని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అడ్లూరి లక్ష్మణ్‌తో విభేదాల నేపథ్యంలో ఆయన స్పందించారు. ''పీసీసీ అధ్యక్షుడు నాతో మాట్లాడారు.. అదే ఫైనల్. రహ్మత్‌నగర్ భేటీలో ఏం జరిగిందో ఆయనకు వివరించా. అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను. పార్టీ పరంగా మాకు మహేశ్ గౌడ్ ఆదేశాలు శిరోధార్యం'' అని అన్నారు. పొన్నం మాదిరిగా అహంకారంగా మాట్లాడటం తనకు రాదంటూ అడ్లూరి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆయన తన తప్పు తెలుసుకుంటారని అనుకున్నానని.. ఇప్పటికీ మారకపోతే తర్వాత జరిగే పరిణామాలకు ఆయన బాధ్యత వహించాల్సి ఉంటుందని అడ్లూరి వ్యాఖ్యానించారు.



## నల్గొండలో ఇంటర్ విద్యార్థిని దారుణహత్య

నల్గొండ: నల్గొండలో దారుణం చోటుచేసుకుంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని గడ్డం కృష్ణ అనే యువకుడు హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాలలో చదువుతున్న మైనర్ బాలికను ట్రాక్టర్ డ్రైవర్ గడ్డం కృష్ణ (22) గత కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ క్రమంలోనే మాట్లాడుకుందామని పిలిచి.. బాలికపై అత్యాచారం చేసి హత్య చేశాడు. ఈ హత్యకు ఓ ఆటో డ్రైవర్ సహకరించినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పరిశీలించారు. నిందితుడు కృష్ణపై టౌన్ పీఎస్‌లో రేప్, పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసినట్టు ఎస్పీ తెలిపారు. ఘటనలో ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో విచారిస్తున్నట్టు చెప్పారు.

## బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో బుధవారం విచారణ

### మంత్రులతో సీఎం సమాలోచనలు

హైదరాబాద్: రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరగనుంది. ఈ విచారణను దృష్టిలో పెట్టుకొని హైకోర్టులో వినిపించాల్సిన వాదనలపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బుధవారం హైకోర్టు తీసుకునే నిర్ణయం ఆధారంగా ముందుకు వెళ్లాలని భావిస్తున్న సీఎం.. వాదనలు గట్టిగా వినిపించే అంశంపై సమాలోచనలు చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీని ప్రభుత్వం తరపున, పార్టీ తరపున హైకోర్టులో వాదనలు వినిపించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ వచ్చినందున కోర్టు నిర్ణయం ఆధారంగా ముందుకెళ్లాలని భావిస్తున్నారు. ఒక వేళ ఎన్నికలకు ఎలాంటి ఆటంకం లేకుండా కోర్టు నుంచి నిర్ణయం వస్తే.. ఇప్పటికే జడ్పీటీసీ స్థానాల వారీగా వచ్చిన ఆశావహుల జాబితాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేయడంపై పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు సమావేశమై కసరత్తు చేయనున్నారు. ఒక వేళ హైకోర్టులో ప్రతికూల ఫలితం వస్తే భవిష్యత్ కార్యాచరణపై చర్చించి ఎలా ముందుకెళ్లాలనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు.



## తెలంగాణ గ్రూప్1 నియామకాలపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ

ఢిల్లీ: తెలంగాణ గ్రూప్1 నియామకాలపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది ఉత్తర్వులకు అనుగుణంగా నియామకాలు ఉండాలని స్పష్టం చేసింది. గ్రూప్1 నియామకాలపై ఇటీవల హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై పలువురు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా.. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిచడంపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల్య బాగ్చిల ధర్మాసనం విచారణ జరిపింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ మధ్యంతర ఆదేశాలు ఇవ్వడంపైనా అభ్యర్థుల తరపు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. వాదనల అనంతరం.. స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసుకు సంబంధించిన ప్రధాన పిటిషన్లన్నీ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఈనెల 15న విచారణకు రానున్న నేపథ్యంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈలోగా చేపట్టిన నియామకాలన్నీ.. రిట్ అప్పీల్స్‌పై ఇచ్చే ఫలితానికి లోబడి ఉంటాయని, హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పాటించాలని సుప్రీంకోర్టు సూచించింది. అవకాశం ఉన్నంత త్వరగా పిటిషన్లపై విచారణ ముగించి తగిన ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనం సూచించింది. ఈ కేసుకు ప్రాధాన్యత ఇచ్చి విచారణ పూర్తి చేయాలని సూచిస్తూ.. సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణను ధర్మాసనం ముగించింది.



## ఎన్డీఎస్ఏ నివేదిక మేరకే మేడిగడ్డ మరమ్మతులు

హైదరాబాద్: తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తుమ్మిడిహట్టి విషయంలో రెండు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కాలువల విషయంలో ఈనెల 22 లోపు నిర్ణయం తీసుకుంటామన్నారు. ''మైలారం ద్వారా సుందిళ్లకు ఒక కాలువ ప్రతిపాదన, నేరుగా ఎల్లంపల్లికి నీటి తరలింపు ఇంకో ప్రతిపాదన ఉంది. వ్యయం, హైడ్రాలిక్, ఇంధనం, అన్నీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం. రెండు ప్రతిపాదనలపై ఇంజినీర్లు 2 వారాల్లోపు నివేదిక ఇవ్వాలని కోరాం. 2027 డిసెంబర్ నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేయాలన్నది మా లక్ష్యం. వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారమే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మరమ్మతులు చేపడతాం. డిజైన్లు రూపొందించేందుకు జాతీయ నైపుణ్య సంస్థల కోసం నోటిఫికేషన్ ఇచ్చాం. శాస్త్రీయ పద్ధతిలో పారదర్శకంగా మరమ్మతులు చేపడతాం. డిండి ఎత్తిపోతలపై అధికారులు 3 రోజుల్లోగా నివేదిక అందించాలి'' అని ఉత్తమ్ అన్నారు.



## తెలంగాణలో రాగల మూడు రోజులు భారీ వర్షాలు..

### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

రాష్ట్రంలో రాగల మూడు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల మీదుగా ఉపరితల ద్రోణులు కొనసాగుతున్నాయి. ఈ ద్రోణుల ప్రభావంతో రాబోయే రోజుల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉపరితల ద్రోణి ఒకటి మంగళవారం ఉదయం ఉత్తర కోస్తా ఒడిశా నుంచి తూర్పు తెలంగాణ వరకు, ఇంటీరియర్ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా కొనసాగుతోంది. ఇది సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. ఇది కాకుండా, మరో ఉపరితల ద్రోణి నైరుతి బంగాళాఖాతం (తమిళనాడు తీరం)పై ఏర్పడిన చక్రవాత సుడిగుండం నుంచి కోస్తా కర్ణాటక వరకు కొనసాగుతోంది. ఈ ద్రోణి తమిళనాడు, రాయలసీమ, దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక మీదుగా వ్యాపించి ఉంది. ఇది సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. ఈ రెండు ద్రోణుల కారణంగా, తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

**పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ :**

నేడు రాష్ట్రంలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ్ పేట, జోగులాంబ గద్వాల జిల్లాలో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

*** అత్యధికంగా నిర్మల్ జిల్లా ముధోల్ లో 10 సెం.మీ ల వర్షం :**

మంగళవారం వర్షం మంచిర్యాల, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో అధిక వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ తెలిపింది. నిర్మల్ జిల్లా ముథోల్ లో 10 సెం.మీ, వరంగల్ జిల్లా ఖానాపూర్ లో 8 సెం.మీ, నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ లో 8 సెం.మీ, నల్గొండ జిల్లా నిడమనూర్ లో 8 సెం.మీ, నిజామాబాద్ జిల్లా రాంజల్ లో 7 సెం.మీ, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 7 సెం.మీ, సూర్యాపేట జిల్లా మట్టపల్లిలో 6 సెం.మీ, సంగారెడ్డి జిల్లా సదాశివపేట్ లో 6 సెం.మీ, కుమురం భీం జిల్లా సిర్పూర్ లో 5 సెం.మీ, జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో 5 సెం.మీ, మంచిర్యాల జిల్లా కోటపల్లిలో 5 సెం.మీ, నారాయణ్ పేట్ జిల్లా మాగనూర్ లో 5 సెం.మీ, నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట్ లో 5 సెం.మీ, హైదరాబాద్ జిల్లా బహదూర్ పురాలో 5.7 సెం.మీ, బండ్లగూడలో 5 సెం.మీ, యాదాద్రి భువనగిరి రామన్నపేట్ లో 5 సెం.మీ, హైదరాబాద్ జిల్లా నాంపల్లిలో 5 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

# సీఎం అభ్యర్థి తేజస్వి కాదా..? కాంగ్రెస్ కీలక వ్యాఖ్యలు

బిహార్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే.. సీట్ల సర్దుబాటు, సీఎం అభ్యర్థి గురించి చర్చ మొదలైంది. ప్రస్తుతం ఎన్డీయే కూటమి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుండగా... విపక్ష మహాగఠ్‌బంధన్ అధికారాన్ని అందుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఈ తరుణంలో ప్రతిపక్షాల కూటమి నుంచి సీఎం అభ్యర్థి ఎవరనే ప్రశ్న తలెత్తింది. దీనిపై కాంగ్రెస్ కీలక వ్యాఖ్యలు చేసింది. విపక్షాల నుంచి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వీ యాదవ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే ఆయన ఆర్జేడీ పార్టీ అభ్యర్థి అని కాంగ్రెస్ నేత ఉదిత్ రాజ్ అన్నారు. "ఆయన తన పార్టీ సీఎం అభ్యర్థి కావొచ్చు. అంతా కలిసి ఇండియా కూటమి అభ్యర్థిపై నిర్ణయం తీసుకుంటాం. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూద్దాం" అని వ్యాఖ్యలు చేశారు. వీటిపై ఆర్జేడీ, తేజస్వి నుంచి స్పందన రాలేదు. ఇటీవల సీఎం అభ్యర్థిత్వం గురించి తేజస్వి స్పందిస్తూ.. "ప్రజలే యజమానులు. వారే ముఖ్యమంత్రిని ఎంపిక చేసుకుంటారు. వారు ఇప్పుడు మార్పు కోరుకుంటున్నారు. ఎవరు ముఖ్యమంత్రి కావాలో వారినే అడగండి. అప్పుడు సమాధానం మీకే తెలుస్తుంది" అని అన్నారు. అలాగే అభ్యర్థి ఎవరో ప్రకటించే ఎన్నికల ప్రచారానికి వెళ్తామని కూడా స్పష్టం చేశారు. ఈ అంశంపై కూటమిలో కొన్నినెలలుగా చర్చ జరుగుతోంది. ఇదే ప్రశ్నపై గతంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా నేరుగా సమాధానం చెప్పలేదు. "ఈ అంశంపై ఇండియా బ్లాక్ నేతలు సమాలోచనలు చేస్తున్నారు. మేం కలిసి పోటీ చేస్తాం. ఫలితాలు బాగుంటాయి" అని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. బిహార్ 2020 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సీట్ల సర్దుబాటును పరిశీలిస్తే.. ఆర్జేడీ 144 స్థానాల్లో బరిలోకి దిగి 75 చోట్ల విజయం సాధించింది. అప్పుడు కూడా తేజస్వినే ఎక్కువగా పార్టీని ముందుకు తీసుకెళ్లి, మెరుగైన ఫలితాలు సాధించారు. దాంతో పాటుగా మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడిగా ఆయనకు ప్రజల్లో పలుకుబడి ఉంది. మరోవైపు కాంగ్రెస్ 70 స్థానాలకు గానూ 19 చోట్ల గెలుపొంది, అంచనాలు అందుకోలేకపోయింది. సీపీఐఎంఎల్ 19 నియోజకవర్గాల్లో పోటీ చేసి 12 చోట్ల గెలుపు బావుటా ఎగురవేసింది. సీపీఎం, సీపీఐ వరుసగా 4, 6 స్థానాల్లో పోటీ చేసి చెరో రెండు చోట్ల విజయం సాధించాయి. గత ఫలితాలను దృష్టిలో ఉంచుకొని.. పార్టీలు నిర్ణయం తీసుకోనున్నాయి.



# త్వరలో భారత్‌కు ఎనిమిది చీతాలు



భారత్‌లో అంతరించిపోయిన చీతాల కోసం ప్రభుత్వం 'ప్రాజెక్టు చీతా'ను చేపట్టి రూ.కోట్లు ఖర్చు చేస్తున్న సంగతి తెలిసిందే. వీటి సంఖ్యను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మరో ఎనిమిది చీతాలను దేశానికి తీసుకొచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. నాలుగు చీతాలను నమీబియా, మరో నాలుగు బోట్స్‌వానా నుంచి తీసుకురానున్నారు. ఈ ఏడాది చివరి నాటికి మధ్యప్రదేశ్‌లోని గాంధీ సాగర్ అభయారణ్యానికి చేరుకుంటాయని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. చీతాల మనుగడకు అనువైన వాతావరణం ఉందా? అనే విషయాలు తెలుసుకోవడానికి ఇప్పటికే దక్షిణాఫ్రికా, కెన్యా బృందాలు సందర్శించాయి. చిరుతల ఆహారం కోసం జింకలు, కుందేళ్లు, అడవి కుక్కలు, ఇతర చిన్న జంతువులను అభయారణ్యానికి తీసుకువస్తున్నారు. 'ప్రాజెక్టు చీతా'లో భాగంగా తొలుత మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులోకి 20 చీతాలను తీసుకొచ్చారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక ఇందులో 9 కూనలు మరణించాయి. బతికిన వాటిలో కొన్ని పిల్లలకు జన్మనిచ్చాయి. ప్రస్తుతం దేశంలో 27 చీతాలున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గాంధీ సాగర్ అభయారణ్యం రాజస్థాన్ సరిహద్దును ఆనుకొని ఉంటుంది.

# వరల్డ్ బర్డ్ ఫొటోగ్రఫీ.. భారతీయుడికి సిల్వర్ మెడల్



ఛత్రపతి శంభాజీనగర్: ఫొటోగ్రఫీకి సంబంధించి మహారాష్ట్రకు చెందిన బైజు పాటిల్‌కు అరుదైన గుర్తింపు లభించింది. 'వరల్డ్ బర్డ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్ 2025'లో అంతర్జాతీయ స్థాయిలో సిల్వర్ అవార్డును కైవసం చేసుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా 33వేల మంది ఫొటోగ్రాఫర్లు 50లక్షల ఫొటోలు పంపించగా.. ఇందులో పాటిల్ తీసిన ఓ ఫొటో అంతర్జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. ఈ విభాగంలో ఓ భారతీయ ఫొటోగ్రాఫర్ ఘనత సాధించడం ఇదే తొలిసారి. ఛత్రపతి శంభాజీనగర్‌కు చెందిన బైజు పాటిల్ వన్యప్రాణుల చిత్రాలు తీయడంలో ప్రసిద్ధుడు. ఇప్పటివరకు 165 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నాడు. ఓ కెమెరా కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గానూ ఉన్నాడు. అహల్యానగర్ జిల్లాలోని హవాడే బజార్‌లోని పొలంలో బంతిపూలపై పక్షులు వాలడాన్ని గమనించి.. వాటిని ఎలాగైనా చిత్రీకరించాలని అనుకున్నాడు. దాదాపు రెండు గంటలు కష్టపడి చివరకు ఆ సన్నివేశాన్ని తన కెమెరాలో బంధించాడు. ఇటీవల బ్రిటన్‌లో నిర్వహించిన వరల్డ్ బర్డ్ ఫొటోగ్రాఫర్స్ పోటీల్లో పాల్గొని అవార్డు కైవసం చేసుకున్నాడు. పన్నెండేళ్లుగా ఈ పోటీలకు ఫొటోలను పంపిస్తూనే ఉన్నానని, చివరకు గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నాడు. ఇప్పటికి ఎన్నో అవార్డులు వచ్చినా.. ఇది మాత్రం తనకెంతో ప్రత్యేకమని చెప్పాడు.



# టూరిస్టు బస్సుపై విరిగిపడిన కొండచరియలు..
# 18 మంది మృతి

హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పుర్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఓ టూరిస్టు బస్సుపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 18 మంది మృతి చెందారు. ప్రమాద సమయంలో బస్సులో 30-35మంది ఉన్నట్లు సమాచారం. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని బయటకు తీసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. హరియాణాలోని రోహ్‌తక్ నుంచి హిమాచల్ లోని ఘుమర్విన్‌కు ప్రైవేటు బస్సు బయలుదేరింది. ఝుండూతా అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బలూఘాట్ ప్రాంతానికి చేరుకోగానే కొండచరియలు విరిగి వాహనంపై పడ్డాయి. బస్సు మొత్తం శిథిలాల కింద చిక్కుకుపోయింది. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన బృందాలు.. పలువురిని ప్రాణాలతో బయటకు తీసినట్లు సమాచారం. ఈ ఘటనపై ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.

# 'ఎయిరిండియా ప్రమాదం'పై
# నిష్పక్షపాత దర్యాప్తు - రామ్మోహన్ నాయుడు





అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదం దర్యాప్తుపై వస్తోన్న ఆందోళనలను పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తోసిపుచ్చారు. దర్యాప్తులో ఎటువంటి అవకతవకలు జరగడం లేదని.. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరుగుతోందన్నారు. విమాన ప్రమాదంపై 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' ఇచ్చిన ప్రాథమిక నివేదికపై విమర్శల నేపథ్యంలో కేంద్ర మంత్రి ఇలా స్పందించారు. "విమాన ప్రమాదాల వ్యవహారాలను చూసే బాధ్యత ఏఏఐబీది. కేవలం వాస్తవాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది. ఎవరి ప్రభావం దీనిపై ఉండదు. నిబంధనల ప్రకారం.. పారదర్శకంగా, స్వతంత్ర పద్ధతిలో దర్యాప్తు జరుగుతోంది. ప్రాథమిక నివేదికపై వ్యాఖ్యలు చేయడం తొందరపాటే అవుతుంది. అసలేం జరిగిందనే విషయంపై స్పష్టత రావాలంటే తుది నివేదిక వచ్చే వరకు వేచి చూడాల్సిందే" అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. దిల్లీలో ఓ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. విలేకరులతో ఈ విధంగా మాట్లాడారు. దేశంలోని అన్ని బోయింగ్ 787 విమానాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని, ఎలక్ట్రికల్ వ్యవస్థల పనితీరుపై దర్యాప్తు చేపట్టాలని కోరుతూ 'ది ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్(ఎఫ్ఐపీ)' ఇటీవల డీజీసీఏకు లేఖ కూడా రాసిన విషయం తెలిసిందే. బోయింగ్ విమానాల్లోని భద్రత ప్రమాణాలపై గతంలోనూ తాము ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని అందులో గుర్తు చేసింది. ఈ క్రమంలోనే పౌర విమానయాన శాఖ మంత్రి క్లారిటీ ఇచ్చారు.





# చూపులేని వారికి సైన్స్ చేరువ..
# ఐఐటీ మద్రాస్ '3డీ' చొరవ

చెన్నై: అంధ విద్యార్థులకు సైన్స్ విశేషాలను మరింత చేరువ చేసేందుకు ఐఐటీ మద్రాస్ ముందుకొచ్చింది. తమిళనాడు సైన్స్ అండ్ టెక్నాలజీ ఫోరం సహకారంతో చెన్నైలోని బిర్లా ప్లానెటోరియంలో 'సైన్స్ యాక్సెసిబిలిటీ హాల్'ను ఏర్పాటు చేసింది. మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ దీన్ని ప్రారంభించారు. దృష్టిలోపం ఉన్నవారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన 3డీ ఆకృతులను ఇక్కడ అందుబాటులో ఉంచారు. స్పర్శ ద్వారా.. ప్రపంచ పటాలు, జలచరాలు, అగ్నిపర్వతాలు వంటివాటి గురించి తెలుసుకునే వీలు కల్పించారు. ఈ ప్రయత్నాన్ని మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రశంసించారు. వాతావరణ మార్పుల వంటి అంశాలనూ బోధించేందుకు దేశవ్యాప్తంగా ఇటువంటివి మరిన్ని ఏర్పాటు చేయాలన్నారు. 3డీ నమూనాల ద్వారా స్వీయ అభ్యాసం సాధ్యమవుతుందని, దేశవ్యాప్తంగా వీటిని విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ హేమచంద్రన్ తెలిపారు.

# మీరు సగం.. మేము సగం: విజయానికి ఇది ఒప్పందం!



బిహార్ ఎన్నికలకు షెడ్యూల్ వచ్చింది. నవంబర్‌లో జరిగే ఎన్నికల కోసం అన్ని రాజకీయ పార్టీలు సిద్ధం అవుతున్నాయి. అధికార ఎన్డీయే కూటమి, విపక్ష మహాగఠ్‌బంధన్ సీట్ల పంపకాలపై ముమ్మరంగా చర్చలు జరుపుతున్నాయి. ఎక్కువతక్కువలు లేకుండా భాజపా, జేడీయూ సమానంగా సీట్లు తీసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మొత్తం 243 స్థానాల్లో ఎన్డీయేలోని ఇతరపక్షాలకు కేటాయించగా మిగిలిన సీట్లను చెరిసగం పంచుకోవాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్డీయే కూటమిలో జేడీయూ, భాజపా, జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థానీ అవామ్ మోర్చా, చిరాగ్ పాసవాన్ ఆధ్వర్యంలోని లోక్‌జనశక్తి పార్టీ, ఉపేంద్ర కుశ్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ భాగం. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. ఎల్‌జేపీకి భాజపా 25 సీట్లు ఆఫర్ చేసింది. హెచ్ఏఎంకు ఏడు, ఆర్ఎల్ఎంకు ఆరు సీట్లు ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆ దిశగా పాసవాన్‌తో చర్చలు జరుగుతున్నాయని, ఆయన వాటాకు వెళ్లే స్థానాల సంఖ్య పెరిగితే, మాంఝీకుశ్వాహాకు కేటాయించే సీట్ల సంఖ్యలో కోత పడే అవకాశం ఉంది. అదే జరిగితే వారికి రాజ్యసభ, ఎమ్మెల్సీ సీట్లు ఆఫర్ చేసి బుజ్జగించనున్నట్లు సమాచారం. ఇదిలాఉంటే.. నవంబరు 6, 11 తేదీల్లో రెండు విడతలుగా బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అదే నెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. షెడ్యూలును ప్రకటించడంతో ఎన్నికల కోడ్ సోమవారం నుంచే అమల్లోకి వచ్చింది. బిహార్ ప్రస్తుత అసెంబ్లీ గడువు నవంబరు 22వ తేదీతో ముగియనుంది. కులాల దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌తో పాటు ఎన్నికలసంఘం చేపట్టిన ప్రత్యేక ముమ్మర సవరణ (సర్), నిరుద్యోగం, వలసలు ప్రధానాంశాలుగా ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కూడా ఎన్నికల అంశంగా నిలవనుంది. ఎన్డీఏ, ఆర్జేడీ నేతృత్వంలోని మహా గఠ్‌బంధన్‌ల (ఇండియా కూటమి) మధ్య హోరాహోరీగా పోరు సాగే అవకాశముంది.

# మాయావతి బంగ్లా కోసం అడిగితే.. కేజ్రీవాల్‌కు ఏది కేటాయించారంటే..!

ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు కేంద్రం ఎట్టకేలకు అధికారిక నివాసం కేటాయించింది. ఇకపై 95, లోధి ఎస్టేట్‌లో టైప్ VII బంగళాలో ఆయన ఉండనున్నారు. దిల్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం గత ఏడాది అక్టోబరులో ఆయన సీఎం అధికారిక నివాసాన్ని ఖాళీ చేసిన విషయం తెలిసిందే. అయితే.. దిల్లీలో మాజీ ముఖ్యమంత్రులకు ప్రభుత్వ వసతి కేటాయించే నిబంధన లేదు. దీంతో ఆయన ఆప్ రాజ్యసభ ఎంపీ అశోక్ మిత్తల్‌కు కేటాయించిన లుటియన్స్‌లోని ఫిరోజ్‌షా రోడ్డులో ఉన్న 5వ నంబరు బంగళాలో తాత్కాలికంగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే గుర్తింపు పొందిన జాతీయ పార్టీ అధ్యక్షుడిగా కేజ్రీవాల్‌కు తగిన నివాసం కేటాయించాలంటూ ఆప్ న్యాయపోరాటం చేసింది. దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం నూతన బంగళాను కేటాయించింది. బీఎస్పీ అధినేత్రి మాయావతి గతంలో నివసించిన 35, లోధి ఎస్టేట్‌లోని బంగళాను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆప్ కోరింది. కానీ, దాన్ని జులైలో కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీకి కేటాయించింది. కేజ్రీవాల్‌కు ఇప్పుడు కొత్తగా కేటాయించిన ఇంట్లో గతంలో భాజపా నేత, జాతీయ మైనారిటీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఇక్బాల్ సింగ్ లాల్‌పుర ఉండేవారు. నూతన నివాసాన్ని కేజ్రీవాల్ దంపతులు ఇప్పటికే పరిశీలించినట్లు సమాచారం. పక్కనే ఉన్న 97వ భవనంలో ప్రస్తుతం కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఉంటున్నారు. ఇదిలాఉండగా.. సీఎంగా ఉన్నప్పుడు సివిల్ లైన్స్ ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని ఆరో నంబరు బంగళాను కేజ్రీవాల్ అధికార నివాసంగా ఉపయోగించేవారు. ఆ సమయంలో దానికి అనేక హంగులు చేసి పునర్నిర్మించారు. ఇందులో ఎంతో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ.. 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా భాజపా విమర్శలు గుప్పించింది. ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా మలచుకుంది.

# స్టాక్ మార్కెట్ల జోరు...

**వరుసగా నాలుగో రోజూ లాభాలే!**

**82,000కు చేరువలో సెన్సెక్స్**

**136 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్, 30 పాయింట్లు లాభపడిన నిఫ్టీ**

**ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్ల మద్దతు**

**మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా సానుకూలంగానే ముగింపు**

**రియల్టీ, ఫార్మా, ఆటో రంగాల షేర్లకు కొనుగోళ్ల కళ**

**ఐటీ, మెటల్, ఎఫ్‌ఎంసీజీ రంగాల్లో కనిపించిన అమ్మకాల ఒత్తిడి**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు కూడా లాభాల బాటలో పయనించాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సూచీలు సానుకూలంగా ముగిశాయి. ముఖ్యంగా ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్ల మద్దతు మార్కెట్లకు కలిసొచ్చింది.

ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 136 పాయింట్ల లాభంతో 81,926 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 30.65 పాయింట్లు పెరిగి 25,108.3 వద్ద ముగిసింది. కీలకమైన 25,000 మార్కు పైన నిఫ్టీ నిలదొక్కుకోవడం మార్కెట్లో సానుకూల సెంటిమెంట్‌ను సూచిస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మార్కెట్ కొద్దిగా పతనమైన ప్రతీసారీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారని వారు తెలిపారు.

బ్రాడర్ మార్కెట్లు కూడా రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.47 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.31 శాతం చొప్పున లాభపడ్డాయి. ఇది మార్కెట్లలో మొత్తం మీద కొనుగోళ్ల ధోరణి బలంగా ఉందని చూపిస్తోంది.

రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ రియల్టీ సూచీ 1.09 శాతం లాభంతో అందరి కంటే ముందుంది. ఆయిల్ అండ్ గ్యాస్, ఫార్మా, హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఆటో, ఎనర్జీ రంగాల షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. అయితే, ఎఫ్‌ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్, మీడియా, మెటల్, ఐటీ రంగాల షేర్లు మాత్రం అమ్మకాల ఒత్తిడికి గురై నష్టాల్లో ముగిశాయి.

## భారత్‌కు విద్యుత్ విక్రయిస్తూ భారీగా ఆదాయం ఆర్జిస్తున్న నేపాల్

**ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.937 కోట్ల విలువైన విద్యుత్ ఎగుమతి**

**భారత్, బంగ్లాదేశ్‌కు నేపాల్ నుంచి భారీగా కరెంట్ సరఫరా**

**వరదలతో ప్రాజెక్టులు దెబ్బతిన్నా ఆగని ఎగుమతులు**

**ఒకప్పుడు కరెంట్ కోతలు, ఇప్పుడు మిగులు విద్యుత్‌తో విదేశీ మారకం**

**భారత్‌తో 10 ఏళ్ల పాటు 10,000 మెగావాట్ల విద్యుత్ ఒప్పందం**



**న్యూఢిల్లీ:** భారీ వరదలు, కొండచరియలు విరిగిపడటంతో పలు జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నప్పటికీ, పొరుగు దేశాలకు విద్యుత్ ఎగుమతుల విషయంలో హిమాలయ దేశం నేపాల్ ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) జూలై మధ్యలో ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు భారత్, బంగ్లాదేశ్‌లకు కరెంట్ విక్రయించి ఏకంగా 15 బిలియన్ల నేపాలీ రూపాయలు (భారత కరెన్సీలో సుమారు రూ.937 కోట్లు) ఆర్జించింది.

నేపాల్ ఇంధన శాఖ మంత్రి కుల్ మాన్ ఘిసింగ్ కార్యాలయం ఈ వివరాలను అధికారికంగా వెల్లడించింది. ఇటీవల వరదల వల్ల దెబ్బతిన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల పరిస్థితిని సమీక్షించేందుకు లోడ్ డిస్పాచ్ సెంటర్‌ను సందర్శించిన అనంతరం ఈ ప్రకటన విడుదల చేశారు. సుమారు 1000 మెగావాట్ల విద్యుత్‌ను పొరుగు దేశాలకు విక్రయించడం ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

దేశీయ అవసరాలు తీరిన తర్వాత మిగులు విద్యుత్‌ను ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ ద్వారా భారత్‌కు నేపాల్ విక్రయిస్తోంది. అంతేకాకుండా, హర్యానా, బీహార్ రాష్ట్రాలతో నేరుగా ద్వైపాక్షిక ఒప్పందాలు కూడా కుదుర్చుకుంది. మరోవైపు, భారత ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను ఉపయోగించుకుని బంగ్లాదేశ్‌కు కూడా రోజుకు 40 మెగావాట్ల విద్యుత్‌ను ఎగుమతి చేస్తోంది.

ఎగుమతులపై వరదల ప్రభావం లేదు

ఇటీవల సంభవించిన వరదల కారణంగా 32 జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని, అయినప్పటికీ విద్యుత్ ఎగుమతులపై ఎలాంటి ప్రభావం పడలేదని నేపాల్ విద్యుత్ అథారిటీ ప్రతినిధి రాజన్ ధాకల్ స్పష్టం చేశారు. "వరదల వల్ల దెబ్బతిన్న ప్రాజెక్టుల ఉత్పత్తి సామర్థ్యం తక్కువే. దానికి తోడు పండుగల సీజన్ కావడంతో దేశంలో విద్యుత్ వాడకం కూడా తగ్గింది. దీంతో ఎగుమతులకు ఎలాంటి ఆటంకం కలగలేదు" అని ఆయన వివరించారు.

ఒకప్పుడు తీవ్రమైన విద్యుత్ కోతలతో సతమతమైన నేపాల్, 2021 నుంచి మిగులు విద్యుత్‌ను భారత్‌కు ఎగుమతి చేస్తూ కీలక ఆదాయ వనరుగా మార్చుకుంది. ప్రస్తుతం దేశంలో దాదాపు 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. 2035 నాటికి 28,500 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, అందులో 15,000 మెగావాట్లను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా, రాబోయే పదేళ్లలో 10,000 మెగావాట్ల విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు భారత్ ఇప్పటికే నేపాల్‌తో దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకుంది.

## ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి..

**భారత్‌లో మాత్రం 9 శాతం వేతనాల పెంపు!**

**అంతర్జాతీయ సంస్థ నివేదిక**

**అయోన్-పీఎల్సీ కీలక నివేదిక**

**న్యూఢిల్లీ:** 2026లో భారతదేశంలో వేతనాలు సగటున 9 శాతం పెరగవచ్చని ఒక నివేదిక అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా మందగమనం ఉన్నప్పటికీ భారత మార్కెట్ సానుకూలంగా ఉన్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. ప్రముఖ అంతర్జాతీయ ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ అయోన్-పీఎల్సీ మంగళవారం విడుదల చేసిన నివేదికలో కీలక విషయాలను వెల్లడించింది. ప్రధానంగా రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాలు, ఎన్బీఎఫ్‌సీ రంగాల్లో వేతన పెంపు అధికంగా ఉండే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల రంగంలోని కంపెనీలు 10.9 శాతం, ఎన్బీఎఫ్‌సీలు 10 శాతం వరకు వేతనాలు పెంచవచ్చని పేర్కొంది. ఆటోమోటివ్, వాహన తయారీ వంటి పరిశ్రమలు 9.6 శాతం, ఇంజినీరింగ్ డిజైన్ సేవలకు సంబంధించిన సంస్థలు 9.7 శాతం, ఇంజినీరింగ్ మరియు తయారీ రంగ కంపెనీలు 9.2 శాతం, రిటైల్, లైఫ్ సైన్సెస్ సంస్థలు 9.6 శాతం చొప్పున వేతన పెంపును అందించే అవకాశముందని నివేదికలో తెలిపింది.

# 'మిస్సైల్ బోల్ట్'తో భారత చిరుత..

**పరుగులో వేగం, టెక్నిక్ జోరందుకునేనా..!**



**న్యూఢిల్లీ:** భారత అథ్లెటిక్స్‌లో సంచలనంగా మారిన అనిమేశ్ కుజుర్ తన అభిమాన హీరోను కలిశాడు. తాను ట్రాక్ మీద చిరుతలా పరుగెత్తడానికి .. భారత ఫాస్టెస్ట్ మ్యాన్‌గా అవతరించడానికి స్ఫూర్తినిచ్చిన 'ఉసేన్ బోల్ట్'తో ముంబైలో ముచ్చటించాడు అనిమేశ్. పుమా కంపెనీ నిర్వహించిన కార్యక్రమంలో జమైకా స్టార్ పలువురు క్రీడా ప్రముఖులను కలుసుకున్నాడు. భారత పరుగుల వీరుడిగా ఎదుగుతున్న అనిమేశ్‌తో కాసేపు కబుర్లు చెప్పాడు బోల్ట్. ఈ సందర్భంగా ఇరువరు రన్నింగ్ ట్రాక్ మీద అద్భుతాలు సృష్టించడం గురించి చర్చించుకున్నారు.

బోల్ట్, అనిమేశ్ కలిసి ఉన్న ఫొటోను పుమా కంపెనీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. 100 మీటర్లు, 200 మీటర్ల పరుగులో జాతీయ రికార్డు నెలకొల్పిన అనిమేశ్ పుమా ఫ్యామిలీతో కలిసినందుకు గర్వంగా ఉంది అని క్యాప్షన్ రాసుకొచ్చింది. తన ఐడల్ బోల్ట్‌ను కలిసిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేకతున్నానని అనిమేశ్ అన్నాడు. బోల్ట్ సైతం యువకెరటంపై ప్రశంసలు కురిపించాడు.

'నీ చేతులు శరీరంతో సమాంతరంగా కదలవు. అవి ముందుకూ వెనక్కి కదులుతుంటాయి. నవు పరుగెత్తడం చూశాను. నువ్వు ఎడమ చేతిని లాక్ చేసి కుడిచేతిని వదులుగా ఉంచుతావు. అలాకాకుండా ఈసారి రెండింటినీ లాక్ చేసి చూడు. నువ్వే విజేతగా నిలుస్తావు' అని మాజీ ఒలింపియన్ వెల్లడించాడు. ఈ సందర్భంగా బోల్ట్ నుంచి ఫాస్ట్‌గా పరుగెత్తడానికి తోడ్పడే సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నాడు అనిమేశ్. భారత పర్యటనలో ఉన్న బోల్ట్‌ను మాజీ గోల్‌కీపర్ శ్రీజేష్, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కూడా కలిశారు.

**టీనేజ్ నుంచే..**

ట్రాక్ మీద రాకెట్ వేగంతో దూసుకెళ్లే అనిమేశ్ కుజుర్‌ది ఛత్తీస్‌గఢ్‌లోని మారుమూల గ్రామం. ఆరడుగుల రెండు అంగుళాల పొడవుండే ఇతడు టీనేజ్ నుంచే తన స్పీడ్‌తో అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఈమధ్యే 100 మీటర్ల దూరాన్ని 10.18 సెకన్లలో చేరుకొని చరిత్ర సృష్టించాడు. తద్వారా గురిందెర్వీర్ (10.20 సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డును బద్ధలు కొట్టి ది 'ఫాస్టెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అవతరించాడు అనిమేశ్. 22 ఏళ్లకే దేశం గర్వించదగ్గ అథ్లెట్‌గా మారిన అతడు ఈమధ్యే మొనాకో డైమండ్ లీగ్‌లో పోటీపడ్డాడు.

అండర్ -23 విభాగంలో 200 మీటర్ల పరుగులో ఆస్ట్రేలియా స్టార్ గౌట్ గౌట్‌తో 'నువ్వానేనా' అన్నట్టు పరుగు తీసి ఔరా అనిపించాడు అనిమేశ్. అయితే.. సెకన్లో పదో వంతుతో పోడియం మీద నిల్చొనే అవకాశం కోల్పోయాడు. అయినా సరే.. అతడేమీ నిరాశకు లోనవ్వడం లేదు. 100 మీటర్లు, 200 మీటర్ల పరుగులో అంతర్జాతీయ వేదికలపై భారతీయ జెండాను రెపరెపలాడించేందుకు మరింత గట్టిగా ప్రయత్నించేందుకు సిద్ధమవుతున్నాడీ యంగ్ అథ్లెట్.

## ఇండియాతో సిరీస్.. ఆసీస్ వన్డే, టీ20 కెప్టెన్‌గా మిచెల్ మార్ష్



**సిడ్నీ:** ఇండియాతో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌కు ఆస్ట్రేలియా తమ జట్లను ప్రకటించింది. గాయం నుంచి కోలుకుంటున్న ప్యాట్ కమ్మిన్స్‌ను ఈ సిరీస్‌కు ఎంపిక చేయలేదు. ఆస్ట్రేలియా వన్డే, టీ20 సిరీస్‌కు మిచెల్ మార్ష్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. అక్టోబర్ 19వ తేదీ నుంచి ఇండియా, ఆస్ట్రేలియా మధ్య తొలి వన్డే జరగనున్నది. వన్డే జట్టులో ఆస్ట్రేలియా కొన్ని మార్పులు చేసింది. వన్డే స్క్వాడ్ నుంచి లబుషేన్‌ను తప్పించింది. అతని స్థానంలో మాథ్యూ రెన్‌షాను తీసుకున్నది. రెన్‌షా ఇప్పటి వరకు ఆస్ట్రేలియా తరపున 14 టెస్టులు ఆడాడు. అయితే 2022 పాకిస్థాన్ టూరులో అతను వన్డే జట్టులో ఉన్నా.. ఇంకా అరంగేట్రం చేయలేదు. కమ్మిన్స్ లేకపోవడంతో.. మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్ ప్రధాన బౌలర్ల పాత్రను పోషించనున్నారు. వీరితో పాటు పేస్ బౌలింగ్ బృందంలో గ్జావియర్ బార్ట్‌లెట్, బెన్ డ్వార్షియస్ ఉన్నారు.

బ్యాటర్ రెన్‌షా గత సీజన్‌లో క్వీన్స్‌ల్యాండ్ తరపున భారీగా పరుగులు సాధించాడు. అతను 50 సగటుతో 350 రన్స్ చేశాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో 80, 106, 62 రన్స్ స్కోర్ చేశాడు. పెర్త్‌లో జరగనున్న ఫస్ట్ వన్డే మ్యాచ్‌కు అలెక్స్ క్యారీ దూరం కానున్నాడు. అక్టోబర్ 15వ తేదీన ఓవల్‌లో జరగనున్న షీఫీల్డ్ షీల్డ్ మ్యాచ్‌లో ఆడనున్నాడు. మణికట్టుకు సర్జరీ కావడం వల్ల గ్లెన్ మ్యాక్స్‌వెల్‌ను టీ20 సిరీస్‌ను తప్పించారు. తొలి రెండు టీ20 లకు మాత్రమే ఆస్ట్రేలియా జట్టును ప్రకటించింది. ఇండియాతో మొత్తం మూడు వన్డేలు, అయిదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి.

**వన్డే జట్టు:** మిచెల్ మార్ష్, గ్జావియర్ బార్ట్‌లెట్, అలెక్స్ క్యారీ, కూపర్ కన్నోలీ, బెన్ డ్వార్షియస్, నాథన్ ఎల్లిస్, కెమరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్,జోష్ ఇంగ్లిష్, మిచెల్ ఓవన్, మాథ్యూ రెన్‌షా, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జంపా.

**టీ20 జట్టు:** మిచెల్ మార్ష్, సీన్ అబాట్, గ్జావియర్ బార్ట్‌లెట్, టిమ్ డేవిడ్, బెన్ డ్వార్షియస్, నాథన్ ఎల్లిస్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహనెమన్, మిచెల్ ఓవన్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా.

## తొలి వరల్డ్ కప్ విజేత.. వెస్టిండీస్ దిగ్గజం కన్నుమూత



**వెస్టిండీస్:** వెస్టిండీస్ క్రికెట్‌లో విషాదం నెలకొంది. తొలితరం క్రికెటర్, మొట్టమొదటి ప్రపంచకప్ గెలుపొందిన బెర్నార్డ్ జులియన్ కన్నుమూశాడు. క్లైవ్ లాయిడ్ సారథ్యంలో 1975 ప్రపంచ కప్ విజేతగా అవతరించిన జట్టులో సభ్యుడైన బెర్నార్డ్ 75 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచాడు. నార్తర్న్ ట్రినిడాడ్‌లో ఆయన మరణించాడని కుటుంబసభ్యులు తెలిపారు. వెటరన్ ప్లేయర్, వరల్డ్ కప్ ఛాంపియన్ అయిన బెర్నాల్డ్ మృతిపట్ల వెస్టిండీస్ క్రికెట్ సంతాపం తెలియజేసింది.

'బెర్నాల్డ్ మరణం మమ్మల్ని ఎంతో బాధించింది. ఆయన జట్టుకు అందించిన సేవల్ని కొనియాడుతున్నాం. విండీస్ జట్టు మొదటి వరల్డ్ కప్ విజేతగా అవతరించడంలో బెర్నాల్డ్ కృషి ఎంతో ఉంది. ఈ కష్టసమయంలో ఆయన స్నేహితులు, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. క్రికెట్ పట్ల ఆయన నిబద్ధత కలకాలం ప్రజల గుండెల్లో నిలిచిపోతుంది. ఆయన ఆత్మకు చేకూరాలని ప్రార్థిస్తున్నాం' అని విండీస్ క్రికెట్ అధ్యక్షుడు కిశోర్ షాల్లో పేర్కొన్నాడు.

**1975 ప్రపంచ కప్ విజేతగా అవతరించిన జట్టు**

ఆల్‌రౌండర్ అయిన బెర్నాల్డ్ కుడిచేతివాటం బ్యాటర్, మంచి స్పిన్నర్ కూడా. అతడు 1973 నుంచి1977 మధ్య కాలంలో24 టెస్టులు, 12 వన్డేలు ఆడాడు. వన్డే వరల్డ్ కప్‌లో విండీస్ విజేతగా నిలవడంలో బెర్నాల్డ్ పాత్ర మరువలేనిది. శ్రీలంక, న్యూజిలాండ్‌పై నాలుగేసి వికెట్లతో చెలరేగిన అతడు ఫైనల్లో బ్యాటుతో మెరిశాడు. లార్డ్స్ మైదానంలో జరిగిన టైటిల్ పోరులో ఆస్ట్రేలియాపై 26 పరుగులతో అజేయంగా నిలిచి జట్టు విజయంలో కీలకమయ్యాడు. 1973లో లార్డ్స్ టెస్టులో బెర్నాల్డ్ చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లండ్ బౌలర్ల వ్యూహాలను తిప్పికొడుతూ 121 పరుగులతో రాణించి జట్టును గెలిపించాడు. అయితే.. సుదీర్ఘ కాలం జాతీయ జట్టుకు ఆడాల్సిన అతడు రెబల్ గ్రూప్‌లో చేరిపోయాడు. అలా.. బెర్నాల్డ్ అంతర్జాతీయంగా ఓ వెలుగు వెలిగే అవకాశాన్ని చేజార్చుకున్నాడు.

# సర్టిఫైడ్ 'డ్రోన్ పైలెట్'గా ధోనీ..

**ఇక ఆకాశంలో హంగామాకు రెడీ..!**





**న్యూఢిల్లీ:** భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనికి అభిరుచులు చాలానే. క్రికెట్‌ను ప్రాణంగా ప్రేమించే మహీభాయ్.. బైక్‌లు నడపడంతో పాటు యానిమేషన్, సినిమా రంగంలోనూ ప్రయోగాలు చేస్తుంటాడు. ఇప్పుడు మరో అడుగు ముందేసి సాంకేతికను అందిపుచ్చుకున్నాడు అతడు. ఇన్నిరోజులు మైదానంలో హెలిక్యాప్టర్ షాట్లతో అలరించిన ధోనీ ఇకపై ఆకాశంలోనూ తన మార్క్ చూపించనున్నాడు. అవును.. 'సర్టిఫైడ్ డ్రోన్ పైలెట్'గా గుర్తింపు సాధించాడీ వెటరన్. ఈ సంతోషకరమైన విషయాన్ని ధోనీ అభిమానులతో పంచుకుంది గరుడ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ. భారత్‌లోని ప్రముఖ ఏరోస్పేస్ సంస్థ అయిన గరుడ ఏరోస్పేస్ నుంచి ధోనీ డ్రోన్ పైలెట్ లైసెన్స్ సాధించాడు. డ్రోన్ల తయారీకి ప్రసిద్ధి చెందిన ఈ కంపెనీకి ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న మహీ.. ఇప్పుడు అదే సంస్థ నుంచి సర్టిఫైడ్ డ్రోన్ పైలెట్‌గా అవతరించాడు. ఇటీవలే చెన్నైలో కంపెనీ డీజీసీఏ అప్రూవ్డ్ రిమోట్ కంట్రోల్ శిక్షణ కేంద్రంలో పాల్గొన్న ధోనీ.. తన నైపుణ్యాలను ప్రదర్శించి లైసెన్స్ పట్టేశాడు. 'గరుడ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రచారకర్త, పెట్టుబడిదారుగా ఉన్న ధోనీ ట్రైనింగ్ పూర్తి చేసుకొని.. డ్రోన్ పైలెట్ లైసెన్స్ సాధించాడు. అతడు చాలా త్వరగా డ్రోన్ ఎగురేయడం నేర్చుకున్నాడు. డ్రోన్ పరిశ్రమలో విస్తరించాలనుకున్న మా టీమ్‌కు ధోనీ కీలకం కానున్నాడు. అతడి లాంటి లెజెండ్స్ ఏదైనా పాటిస్తే దేశం మొత్తం వాళ్లను అనుసరిస్తుంది. ప్రస్తుతం ధోనీ డీజీసీఏ సర్టిఫైడ్ డ్రోన్ పైలెట్. అతడు గరుడ ఏరోస్పేస్ కేంద్రంలో శిక్షణ పొందాడు. ఇప్పటికే 2,500 మంది ఔత్సాహిక యువతకు డ్రోన్ పైలటింగ్‌లో ట్రైనింగ్ ఇచ్చాం' అని ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించింది గరుడ స్పేస్.

మరో సీజన్‌పై సందిగ్ధత

ఐపీఎల్ లెజెండ్ అయిన ధోనీ చెన్నై సూపర్ కింగ్స్‌కు రికార్డు స్థాయిలో ఐదు ట్రోఫీలు అందించాడు. అశేష అభిమానగణమున్న ఈ వెటరన్.. నలభైల్లోనూ కుర్రాడిలా చెలరేగిపోతున్నాయి. అయితే.. వచ్చే సీజన్ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. తన శరీరం సహకరిస్తే వచ్చే రెండు మూడు నెలల్లో నిర్ణయం ప్రకటిస్తానని ఐపీఎల్ 18వ సీజన్ ముగియగానే తాలా పేర్కొన్నాడు.

వయసు పైబడడం, గాయాలు వేధిస్తుండడంతో అతడు వైదొలిగే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే తన సారథిగా రుతురాజ్ గైక్వాడ్‌ను ప్రకటించిన ధోనీ.. అతడు గాయంతో నిష్క్రమించడంతో మళ్లీ పగ్గాలు అందుకున్నాడు. ఈమధ్యే కోలుకున్న గైక్వాడ్ వచ్చే సీజన్‌లో సీఎస్కేను నడిపించడం ఖాయం.

# సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తున్న బ్యూటీ..

టాకీస్: తెలుగులో 13 సినిమాలు చేసినా కూడా ఈ చిన్నదానికి ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదు. ఇంతకూ ఈ ముద్దుగుమ్మ ఎవరో తెలుసు కదా.. ఆమె నందిత శ్వేత. ఈ చిన్నది.. తెలుగు, తమిళ్, కన్నడ భాషల్లో సినిమాలు చేసి మెప్పించింది ఈ అందాల భామ. చాలా మంది ముద్దుగుమ్మలు అందం అభినయం ఉన్న అవకాశాలు అందుకోవడం కోసం చాలా కష్టపడుతూ ఉంటారు. అవకాశాల కోసం ఎదురుచూస్తున్న బ్యూటీలు ఇండస్ట్రీలో చాలా మంది ఉన్నారు వారిలో ఈ అమ్మడు ఒకరు. తెలుగులో 13 సినిమాలు చేసినా కూడా ఈ చిన్నదానికి ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదు. ఇంతకూ ఈ ముద్దుగుమ్మ ఎవరో తెలుసు కదా.. ఆమె నందిత శ్వేత. ఈ చిన్నది.. తెలుగు, తమిళ్, కన్నడ భాషల్లో సినిమాలు చేసి మెప్పించింది ఈ అందాల భామ. ఎక్కడికి పోతావు చిన్నవాడా సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది ఈ బ్యూటీ. 2016లో వచ్చిన ఎక్కడికి పోతావు చిన్నవాడా సినిమా మంచి విజయాన్ని అందుకుంది. దాంతో నందిత శ్వేత పేరు మారుమ్రోగింది. ఈ సినిమాలో సెకండ్ హీరోయిన్ గా నటించి మెప్పించింది. ఆ తర్వాత ఈ అమ్మడికి వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. టాలీవుడ్ లో బ్యాక్ బ్యాక్ సినిమాలు చేస్తుంది. ఆతర్వాత శ్రీనివాస కళ్యాణం, బ్లఫ్ మాస్టర్, ప్రేమకథ చిత్రం 2 సినిమాల్లో నటించింది. కానీ మంచి హిట్ మాత్రం అందుకోలేకపోయింది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ క్రేజీ ఆఫర్స్ కోసం ఎదురుచూస్తుంది ఈ వయ్యారి భామ. ఇక సోషల్ మీడియాలో రకరకాల ఫొటోలతో ఆకట్టుకుంటుంది నందిత. తాజాగా ఈ అమ్మడి ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి.




MOVIE TIME

# కమల్, రజనీ మల్టీస్టారర్ మూవీ

## తాను దర్శకత్వం వహించడం లేదన్న ప్రదీప్ రంగనాథ్

**టాకీస్:** అగ్ర కథానాయకులు రజనీకాంత్, కమల్‌హాసన్ 46 ఏళ్ల తర్వాత కలిసి స్క్రీన్ పంచుకోనున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ అధికారికమైనప్పటినుంచి దీనికి సంబంధించిన అనేక వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కోలీవుడ్ దర్శకుడు ప్రదీప్ విడుదలైన ఆయన సినిమాలు మొదటిరోజు మొదటి ఆట చూశాను. 'డ్రాగన్' విడుదలయ్యాక ఆయన నన్ను ప్రశంసించారు. ఆ మాటలు ఎప్పటికీ మర్చిపోలేనని ప్రదీప్ తెలిపారు. ఇటీవల జరిగిన సైమా అవార్డుల వేడుకలో కమల్‌హాసన్ ఈ మల్టీస్టారర్ గురించి



రంగనాథన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా దీనిపై ఆయన స్పందిస్తూ... తాను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కాదని తెలిపారు. ఆ సినిమాకు నాకు దర్శకత్వం ఆఫర్ వచ్చిందో, లేదో కూడా నేను చెప్పను. కానీ, నేను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కాదు. ఎందుకంటే ప్రస్తుతం దర్శకత్వం మీద కంటే యాక్టింగ్ మీదే ఫోకస్ పెట్టాలనుకుంటున్నాను. కమల్-రజనీకాంత్ మల్టీస్టారర్ గురించి ఇంతకంటే ఏం చెప్పలేనని అన్నారు. నేను రజనీకాంత్‌కు వీరాభిమానిని. ఇప్పటివరకూ అధికారికంగా వెల్లడించారు. 'మీరు, రజనీకాంత్ కాంబినేషన్‌లో ఓ సినిమాను ఆశించవచ్చా' అని వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు ఆయన ఆసక్తికర సమాధానమిచ్చారు. ప్రేక్షకులు మా కాంబినేషన్‌ను ఇష్టపడితే మంచిదే కదా.. వారు సంతోషంగా ఉంటే మాకూ ఆనందమే. మేమిద్దరం కలిసి నటించాలని ఎన్నోఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాం. కానీ, ఇన్ని రోజులు అది కుదర్లేదు. త్వరలోనే మీ ముందుకు కలిసిరానున్నాం. అది మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తుందని స్పష్టంచేశారు.

# మతిపోగొట్టేస్తోన్న అనుపమ..

టాకీస్: అనుపమ పరమేశ్వరన్... సౌత్ సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు. తక్కువ సమయంలోనే తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకున్న ఈ కేరళ కుట్టి.. ఇప్పుడు బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో అలరిస్తుంది. ఈ ఏడాది అనుపమ నటించిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద హిట్టయ్యాయి. తాజాగా సోషల్ మీడియాలో ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ తెగ ఆకట్టుకుంటున్నాయి. 2015లో ప్రేమమ్ సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది అనుపమ పరమేశ్వరన్. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. అందులో హీరోయిన్ కాదు.. కేవలం ఐదు నిమిషాల స్క్రీన్ స్పేస్ కూడా లేని అతిథి పాత్రలో మాత్రమే కనిపించింది. ఆ తర్వాత తెలుగులో అఆ సినిమాతో తెరంగేట్రం చేసింది. ఇందులోనూ హీరోయిన్ పాత్ర కాదు. శర్వానంద్ నటించిన శతమానం భవతి సినిమాతో కథానాయికగా పరిచయమైంది. తెలుగులో వరుస సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంటుంది. మలయాళంలో ప్రేమమ్ సినిమా తర్వాత ఆమెకు పూర్తి నిడివి ఉన్న పాత్ర రాలేదు. దాదాపు 15 సంవత్సరాల తర్వాత ఇటీవల జానకి వర్సెస్ కేరళ సినిమాలో నటించింది. విడుదలకు ముందే ఈ మూవీ వివాదాల్లో చిక్కుకుంది. ఇటీవలే తెలుగులో కిష్కింధ పురి, పరదా చిత్రాల్లో నటించి మెప్పించింది. ఈ రెండు చిత్రాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు ఈ అమ్మడు మరిన్ని ఆఫర్స్ కోసం వెయిట్ చేస్తుంది. అలాగే సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా ఈ అమ్మడు నెట్టింట షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. మోడ్రన్ చుడిధార్ లో.. రింగుల జుట్టులో ఎంతో అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం అనుపమ లేటేస్ట్ ఫోటోస్ చూసి అడియన్స్ ఫిదా అవుతున్నారు.



# అప్పుడే ఓటీటీలోకి ఇడ్లీ కొట్టు

**టాకీస్:** తమిళ స్టార్ హీరో ధనుష్ ఇటీవల ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా తెలుగులో ఇడ్లీ కొట్టు. అక్టోబర్ 1న దసరా కానుకగా విడుదలైన ఈ సినిమా మొదటి షో నుంచే థియేటర్లలో మంచి హిట్ టాక్ హీరోగానే కాకుండా రైటర్, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌గా కూడా పనిచేయడం ఈ మూవీకి మరింత హైప్ తెచ్చింది. అరుణ్ విజయ్, సత్యరాజ్, సముద్రఖని, నిత్యా మీనన్, షాలిని పాండే వంటి స్టార్స్ ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు.




దక్కించుకుంది. విమర్శకుల ప్రశంసలు, ప్రేక్షకుల ఆదరణ ? రెండింటిని సొంతం చేసుకుంది. ఇక తాజాగా ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ఎంట్రీకి సిద్ధమవుతున్నట్టు టాక్ నడుస్తోంది.రిలీజ్ అయిన నెల రోజుల్లోపే డిజిటల్ ప్రీమియర్‌కి వస్తుందన్న వార్త ఫ్యాన్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న దాని ప్రకారం, ఇడ్లీ కడై ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకొగా. ఈ సినిమా అక్టోబర్ 29 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుందని టాక్ వినిపిస్తోంది. అంటే, థియేటర్లలో ఇంకా రన్ అవుతున్నప్పుడే డిజిటల్ ఫ్లాట్‌ఫార్మ్‌కి రావడం పెద్ద సర్ప్రైజ్. ఇక ధనుష్ కేవలం గ్రామీణ నేపథ్యంలో నడిచే ఈ కథలో ధనుష్ 'మురుగన్' పాత్రలో కనిపిస్తాడు. కుటుంబ వారసత్వాన్ని కాపాడుకోవడం, ఆధునిక ఆశయాలను నెరవేర్చుకోవడం మధ్య కన్ఫ్యూజ్ అయ్యే యువకుడి ఎమోషనల్ జర్నీని ఈ సినిమా చూపిస్తుంది. చివరికి తన మూలాలను తిరిగి చేరుకునే మురుగన్ పాత్రలో ధనుష్ నేచురల్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. తిరుచిత్రం బలం తర్వాత నిత్యా మీనన్‌తో ఆయన జోడీ ఈ సినిమాకు మరో హైలైట్. జివి ప్రకాష్ మ్యూజిక్ కూడా సినిమాకు బలంగా నిలిచింది. మొత్తంగా, థియేటర్లలో బజ్ క్రియేట్ చేసిన ఇడ్లీ కడై ఇప్పుడు ఓటీటీ లోనూ అదే మంత్రాన్ని కొనసాగించనుంది.

# కాంతారా మూవీకి క్రికెటర్ రాహుల్ ఫిదా

**టాకీస్:** రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాంతార చాప్టర్ 1' దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ సినిమాపై సినీ, రాజకీయ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా ఈ మైథలాజికల్ ఫిల్మ్‌కు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (ఫిదా ందని నిర్మాణ సంస్థ తెలిపింది. ఇది టీమ్ అందరికీ నిజంగా విన్నింగ్ మూమెంట్ అని పేర్కొంది. కేఎల్ రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపింది. కేఎల్ రాహుల్ తనకు 'కాంతార' సినిమా అంటే ఎంతో ఇష్టమని ఇటీవల చెప్పిన విషయం తెలిసిందే. రాయల్ ఛాలెంజర్స్






అయ్యారు. తన ఇన్‌స్టా స్టోరీలో దీనిపై పోస్ట్ పెట్టారు. కాంతార చాప్టర్ 1 చూశాను. మరోసారి రిషబ్ తన ప్రతిభతో మేజిక్ చేశారు. మంగుళూరు ప్రజల నమ్మకాన్ని తెరపై అద్భుతంగా చూపించారని కేఎల్ రాహుల్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌కు కాంతార టీమ్ స్పందించింది. ఇది చూశాక ఎంతో గర్వంగా ఉ బెంగళూరు జట్టుపై ఢిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించిన తర్వాత రాహుల్ చేసుకున్న సెలబ్రేషన్స్ నెట్టింట వైరల్ అయ్యాయి. దీనిపై కేఎల్ స్పందిస్తూ.. మ్యాచ్ గెలిచాక సెలబ్రేషన్స్ నా ఫేవరెట్ సినిమాల్లో ఒకటైన 'కాంతార' స్ఫూర్తితో చేశాను. నేను ఇక్కడ ఆడుతూ పెరిగాను అని చెప్పడం నా సెలబ్రేషన్స్ ఉద్దేశం.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.